# గొప్ప కృప

## యోనా గ్రంథం సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :**

సాతానుకు ఇష్టంలేని పాత నిబంధన గ్రంథాలలో యోనా ఒకటి. క్రీస్తు స్త్రీ సంతానం నుండి వస్తాడని, సాతాను తలను చితకగొడతాడని వ్రాయబడిన ఆదికాండము (3:15), శత్రువైన సాతానును నాశనం చేయడానికి ఆయన మహిమాన్వితునిగా రాబోతున్నాడని తెలిపే దానియేలు గ్రంథం, మరియు క్రీస్తు మరణ పునరుత్థానాలకు సాదృశ్యమైన యోనా గ్రంథం, సాతానుకు ఇష్టం లేదు. కనుకనే ఈ గ్రంథాన్ని నమ్మకుండ అనేకులలో పలు అనుమానాలను అపనమ్మకాన్ని సృష్టిస్తున్నాడు.

**A. యోనా గ్రంథం :** యోనా గ్రంథంలో ప్రవచనం లేదుగాని ప్రవక్త జీవిత అనుభవం వ్రాయబడింది. రచయిత ఎవరో సరైన ఆధారాలు లేవు.

1. ఈ గ్రంథం వీరయోధుల జీవిత గాథలాగే ఒక ఇతిహాసమని లేక ఒక ఆధ్యాత్మిక రచన లేక వ్యాఖ్యానం అన్న అభిప్రాయం ఉన్నది.

2. ఇది ఒక ఉపమానం మాత్రమేనని, అందలి విషయాలు అలంకార రూపంలో చెప్పబడ్డాయని మరికొంత మంది అభిప్రాయం. యోనా – ఇశ్రాయేలు జాతికి; సముద్రం – అన్యజాతులకు; చేప – బబులోను చెరకు; బయటికి కక్కి వేయబడుట – ఎజ్రా కాలంలో చెర నుండి తిరిగి వచ్చుటకు సూచనగా ఉన్నాయని వారి అభిప్రాయం. అయితే బైబిలులో తరచుగా ఉపమానాలు చెప్పబడినా, ఏ ఉపమానమే గాని ఒక గ్రంథమంతా వివరించబడలేదు (ఉదా: I సమూ 12:1; లూకా 10:30)

3. అయితే యోనా గ్రంథం వాస్తవంగా జరిగిన చారిత్రాత్మక సంఘటన అన్న అభిప్రాయం సరైనది. అందులో వ్రాయబడిన విషయాలే అవి వాస్తవికంగా జరిగినవని నిరూపిస్తాయి. యూదులు మరియు ఆదిమ సంఘం కూడ అలాగే నమ్మారు. యోనా చారిత్రాత్మక వ్యక్తి (II రాజు 14:25). అతని ఊరి పేరు, తండ్రి పేరు మరియు అతడు ప్రవచించిన కాలం నాటి రాజు పేరు చరిత్రలో ఉన్నాయి. యేసు ప్రభువు కూడ యోనా గ్రంథంలోని విషయాలను వాస్తవికమైనవని చెప్పాడు (మత్త 12:89).

**B. గ్రంథరచన కాలం :** కొంతమంది ఈ గ్రంథంలోని సంఘటనలు క్రీ.పూ. 745 సం॥ జరిగాయని, మరి కొందరు క్రీ.పూ. 860 సం॥నికి ముందు జరిగాయని చెప్తారు. కనుక ఈ గ్రంథం క్రీ.పూ. 800–750 సం॥ మధ్య కాలంలో వ్రాయబడి ఉండవచ్చును.

## C. గ్రంథ విశిష్టత :

యోనా గ్రంథంలో 4 అధ్యాయాలున్నా, ఒకే అధ్యాయం గల ఓబద్యా గ్రంథం పరిమాణమునకు రెట్టింపు మాత్రమే ఉన్నది. చిన్న అధ్యాయాలున్నా అందులో 6 ప్రాముఖ్యమైన అంశాలు ఉన్నాయి.

1. పాత నిబంధనలోని గ్రంథాలలో క్రైస్తవ విశ్వాసాన్ని గూర్చిన గొప్ప సిద్ధాంతాలు ఉన్నాయి. యోనా గ్రంథం పునరుత్థానమును గూర్చిన సిద్ధాంతాన్ని (బోధిస్తుంది) సూచిస్తుంది. అందుకే ఈ పుస్తకం గుర్తించదగినది.

2. రక్షణ, క్రియల ద్వారా కాదని, దేవుని కృప ద్వారానే (2:9) అని ఈ గ్రంథం తెలుపుతుంది. నిష్ఠగల యూదులు ప్రాయశ్చిత్తార్థ దినమున (లేవీ 23:27-29) యోనా గ్రంథాన్ని చదువుతారు.

3. యోనా గ్రంథం, దేవుని కృప సంకల్పం మార్పు చెందదని కూడ తెలియజేస్తుంది. యోనా అవిధేయత చూపించినా, దేవుడు తన సంకల్పం నుండి విరమించుకోలేదు. మన అవిధేయతను బట్టి మనమే ఆశీర్వాదాలను పోగొట్టుకొంటాము గాని దేవుని ప్రణాళిక మార్చబడదని జ్ఞాపకముంచుకోవాలి.

4. మరో విషయం ఏమంటే, మన అపనమ్మకత్వాన్ని బట్టి దేవుడు ఎన్నడూ త్రోసివేయడు. మనం వాడబడేందుకు మళ్ళీ మళ్ళీ అవకాశాలిస్తాడు. అయినా లోబడకపోతే విశ్వాసిగా మిగిలిపోతాము గాని ఆయన పనిలో పాలిభాగస్తులుగా ఉండము.

5. దేవుడు మంచివాడు కృపగల వాడు మాత్రమే కాదు (4:2), దండించేవాడు కూడా అని యోనా గ్రంథం నేర్పిస్తుంది.

6. దేవుడు ఇశ్రాయేలుకు మాత్రమే కాదు అన్యులకు కూడా దేవుడే అన్న గొప్ప సత్యాన్ని ఈ గ్రంథం స్పష్టం చేస్తుంది.

## II. గ్రంథ విభజన :

ఈ గ్రంథంలోని 4 అధ్యాయాలలో యోనా చేసిన నాలుగు ప్రయాణాలున్నాయి. యోనా అన్యజనులకు మిషనరీగా పంపించబడ్డాడు. పౌలు కూడ అన్యజనులకు మిషనరీగా నాలుగు ప్రయాణాలు (రోమా పట్టణానికి వెళ్ళడంతో సహా) చేసాడు. యోనా మరియు పౌలు జీవితంలో పోలికలున్నాయి. ఇద్దరూ సముద్రంలో ప్రయాణం చేసారు. తుఫానుల నెదుర్కొన్నారు, నావికుల మధ్య సాక్షులుగా ఉన్నారు, వారిని మరణం నుండి తప్పించారు. యోనా ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని ఈ గ్రంథాన్ని అధ్యాయాల వారిగా ఈ క్రింది విధానంలో విభజించవచ్చును. అతడు ప్రయాణాన్ని ప్రారంభించిన స్థలం, అతని గమ్యం, చివరికి అతడు చేరిన స్థలం ఈ భాగాలలో చూడవచ్చును.

A. **మొదటి అధ్యాయం :** గత్యేపెరు లేక సమరయ నుండి నీనెవెకు వెళ్ళాల్సిన యోనా చేప కడుపులోనికి చేరుట.

B. **రెండవ అధ్యాయం :** చేప కడుపులో నుండి నీనెవెకు వెళ్ళాల్సిన యోనా ఆరిన నేలపై కక్కివేయబడుట.

C. **మూడవ అధ్యాయం :** ఆరిన నేల నుండి నీనెవెకు వెళ్ళాల్సిన యోనా చివరికి నీనెవె పట్టణం చేరుట.

D. **నాల్గవ అధ్యాయం :** నీనెవెలో ఉండాల్సిన యోనా ఊరిబయట సొరచెట్టు క్రింద, దేవుని హృదయానికి చేరువగుట.

## III. అంశాల వారిగా విభజన - సంక్షిప్త వివరణ :

### A. యోనా ప్రతిఘటించుట : (దేవుని సహనం ప్రదర్శించుబడుట) 1 అధ్యా

1. **దేవుని ఆజ్ఞ (1:1,2) :** ఈ భాగంలో నీనెవె పట్టణస్తుల దోషమును గూర్చి దాని దుర్గతిని గూర్చి చెప్పబడింది. ఆ దినాలలో ప్రపంచంలో కెల్ల బలమైన అష్షూరు రాజ్యానికి, నీనెవె రాజధాని. అది మహా పట్టణం అని పిలువబడింది. ఈ పట్టణం ఎంత గొప్పదో దాని పాపం కూడ అంతే గొప్పది. దాని పాపం, దేవుడు దానికి తీర్పుతీర్చేంత తీవ్రస్థాయికి చేరుకున్నది (నహూ 1:11, 2:12,13; 3:1,4,16,19). అష్షూరీయులు, ఇశ్రాయేలు రాజ్యానికి బద్ధ విరోధులు. యోనా, తన స్వగ్రామం నుండి దాదాపు 800 కి.మీ. దూరంలో ఉన్న నీనెవె పట్టణంపైకి రానున్న తీర్పును గూర్చి ప్రకటించడానికి పంపించబడ్డాడు. దేవుడు కొన్ని పర్యాయాలు తన సేవకులకు, ఇష్టంలేని పనులు మరియు కష్టమైన పనులను అప్పగిస్తాడు. అయితే దైవ సంకల్పసిద్ధి నిమిత్తం వాటిని తప్పకుండా చేయాల్సి ఉంటుంది (I కొరింథీ. 9:17).

2. **దేవుని సేవకుని స్పందన (1:3) :** వాస్తవంగా యోనా నీనెవెకు తూర్పువైపు ప్రయాణించాలి. కాని అతడు పశ్చిమ దిశకు వెళ్ళాడు. యోనా దేవుని పిలుపుకు వ్యతిరేకంగా స్పందించాడు. ఆయన ఆదేశాన్ని పాటించలేదు. అందుకు పలు కారణాలున్నాయి.

ఎ) పాత నిబంధన అంతటిలో మనం గమనిస్తే, దేవుడు తన ప్రవక్తలను యూదా మరియు ఇశ్రాయేలు ప్రజల మధ్యకే పంపించాడు. విదేశానికి పంపించబడిన మొదటి ప్రవక్త యోనా. అయితే దేవుడు ఎందుకు వెళ్ళమన్నాడో యోనాకు తెలిసినా, యొప్పేకు వెళ్ళాడు. గాని, తాను దేవుని చిత్తంలోనే ఉన్నాననుకొన్నాడు. అన్నీ మనకు అనుకూలంగా ఉంటే అది దేవుని చిత్తమని, మనకు ఇష్టం లేనివి దేవుని చిత్తం కాదని అనుకోవడం పొరపాటు.

బి) యోనా కాలంలో అష్షూరు, ప్రపంచంలోని దేశాలన్నింటిని గడగడ వణికించింది. వారు తరచుగా ఉత్తర ఇశ్రాయేలు రాజ్యంపైకి దండెత్తి వచ్చేవారు. వారు స్త్రీలను పిల్లల్ని హింసించిన విధానాన్ని యోనా కళ్ళారా చూసి ఉండవచ్చును. యోనా నీనెవె పట్టణస్తులకు రాబోయే దుర్గతిని గూర్చి ప్రకటిస్తే, వారు మారుమనస్సు పొందుతారని, దేవుడు కృపగల వాడు గనుక వారిని క్షమిస్తాడని యోనాకు బాగా తెలుసు (4:2) అయితే వారు రక్షించబడడం అతనికి ఇష్టం లేదు.

సి) పై కారణాలను బట్టి యోనా పారిపోలేదని అనుకొంటె, అతడు తప్పనిసరిగా దేవుని పట్ల అవిధేయుడైన ప్రవక్త అని చెప్పవచ్చును. అతడు దేవుని చిత్తంలో ఉండడానికి ఇష్టపడలేదు, తప్పిపోయిన కుమారుని వలె దూరంగా వెళ్ళిపోయాడు. అయితే అతని ప్రయత్నం నిష్ప్రయోజనమైనది. దేవుని నుండి పారిపోవడమన్నది మానవులకు అసాధ్యం. (కీర్త 139:7-12).

3. **దేవుని హస్తం - దెబ్బకొట్టుట (1:4-12) :** యోనా గొప్ప అవిధేయతకు తగిన శాస్తి చెయ్యడానికి దేవుడు గొప్ప తుఫాను పుట్టించాడు. సృష్టకర్తయైన దేవుడు సృష్టినంతా తన అదుపులో ఉంచుకొని ఎప్పుడైనా, దేనినైనా తన ప్రయోజన సిద్ధికి వాడుకోగలడు (యోబు 37:9-13; కీర్త 107:25; 148:8). ఇక్కడ దేవుడు మంచి ఉద్దేశంతోనే తుఫానును పంపించాడు. ఇది సాధారణమైన తుఫాను కాదని నావికులు గ్రహించారు. ఒక శోచనీయమైన సంగతి ఏమంటే, ఓడలోని వారంతా అన్యులే అయినా, తమ తమ దేవతలకు ప్రార్థించారు గాని, జీవములగల దేవుని సేవకుడైన యోనా గాఢ నిద్రపోతున్నాడు. ఎవరిని బట్టి ఈ కీడు వచ్చిందో తెలిసికోడానికి వారు చీట్లు వేసారు (1:7) చీట్లు వేయుట అన్నది దేవుని చిత్తం తెలిసుకోడానికి, వంతుల చొప్పున పంచి ఇవ్వడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఆ దినాలలో ఉపయోగించబడిన పద్ధతి (లేవీ 16:8; యోహా 18:6; కీర్త 22:18; సామె 18:18 అపొ.కా.1:26). అతడు దేవుని చిత్తంలో లేడు గనుక ఇతరుల మధ్య దేవుని సాక్షిగా లేడు. వారు అడిగేంత వరకు తనను గూర్చిగాని, దేవుని గూర్చిగాని చెప్పలేదు. పౌలు ఈలాంటి స్థితిలోనే ఉన్నప్పటికి, ఓడలోని వారికి దేవుని గూర్చి చెప్పి వారిని ధైర్యపరచాడు (అపొ.కా. 27:22-26). కారణం, అతడు దేవుని చిత్తంలో ఉన్నాడు. యోనాలో ఉన్న ఓ మంచి లక్షణం ఏమంటే తన పరిస్థితిని ఉన్నది ఉన్నట్లు చెప్పాడు. ఆ ఉపద్రవాన్ని తప్పించుకునే మార్గాన్ని కూడ చెప్పాడు 1:12).

4. **నావికుల స్పందన - యోనాను సముద్రములో పడవేయుట (1:13-17) :** యోనా దేవుని చిత్తంలోనికి రావడానికై కల్పించబడిన తుఫానును బట్టి అన్యులైన నావికులు దేవుని చిత్తాన్ని తెలిసికొన్నారు (1:14). గాని యోనా మాత్రం, తాను చనిపోవడానికైనా సిద్ధపడ్డాడు గాని నీనెవెకు వెళ్ళదలచలేదు. మనిషి స్వయం చిత్తం ఎంత బలంగా పని చేస్తుందో చూసారా! యోనా మేలు పొందలేదు గాని, ఆ ఓడలో ఉన్నవారు దేవుణ్ణి

తెలిసికొన్నారు. ఆయనకు భయపడ్డారు, బలి అర్పించి మ్రొక్కుబళ్ళు చేసారు (1:9,10,14,16). గొప్ప పట్టణానికి వెళ్ళి దాని దుర్గతిని గూర్చి ప్రకటించాల్సిన యోనా గొప్ప తుఫానులో చిక్కుకొని చివరకు గొప్ప మత్స్యము కడుపులోనికి చేరుకున్నాడు (1:17). దేవుడే అతన్ని సముద్రంలో పడవేసాడు. నావికులు ఆయన సాధనాలు మాత్రమే. కింగ్‌జేమ్స్ తర్జుమా బైబిలులో తిమింగలం అని వ్రాయబడిందిగాని, గ్రీకు భాషలో పెద్ద చేప అని తర్జుమా చేయబడింది (మత్త 12:40). ఈ చేప దేవుని ద్వారా సిద్ధపర్చబడింది.

## B. యోనా ప్రార్థించుట : (దేవుని క్షమాపణ ప్రదర్శించబడుట) 2 అధ్యా

1. **దేవుని మనవి (2:18) :** చేప కడుపులో మనిషి మూడు దినాలు బ్రతికి ఉండలేడని, యోనా ప్రార్థనలో పాతాళమును గూర్చి ప్రస్తావించాడు గనుక అతడు నిజంగా చనిపోయి తిరిగి లేచాడని కొందరి అభిప్రాయం (2:2,6). అయితే దేవుడు అతన్ని చేప కడుపులో సయితం మూడు రోజులు సజీవునిగా ఉంచగలడని, చేప కడుపులో యోనా చచ్చిపోతానని అనుకొని, దేవుడు తన మనవి విని మరణం నుండి లేపుతాడని నమ్మాడని మరికొందరి అభిప్రాయం. దేవునికి ఈ రెండు కూడ సాధ్యమే. యోనా నీనెవె పట్టణస్థులకు ఏలాగు సూచనగా ఉన్నాడో అలాగే యేసు ప్రభువు తన తరము వారికి సూచనగా ఉన్నాడు (లూకా 11:30). ఈ ప్రార్థనలో యోనా దేవుని పరిశుద్ధాలయాన్ని గూర్చి రెండుసార్లు ప్రస్తావించాడు (2:4,7) బహుశా యెరూషలేము దేవాలయాన్ని గూర్చి కావచ్చును (**I** రాజు 8:38,39). ఆ కాలం నాటి ప్రజలకు తెలియని ఓ విజ్ఞాన శాస్త్ర సంబంధమైన సత్యాన్ని యోనా వెల్లడిస్తున్నాడు (2:6). సముద్రాఘాదములో పర్వతాల పునాదులుంటాయని విజ్ఞాన శాస్త్రం నిరూపించింది. బైబిలు నిజంగా దేవుని వాక్యం అనడానికి ఇదొక రుజువు. ప్రార్థన అన్నది, ఒక స్థలానికి పరిమితం కాదని, ఎక్కడ ప్రార్థించినా దేవుడు వింటాడని, యోనా ప్రార్థన నిరూపిస్తున్నది. దేవుడు తనను విడిపిస్తాడని, ఆయనకు తాను అర్పణలనర్పిస్తానన్న విశ్వాసం యోనాకు ఉన్నది. యోనా అవిధేయత అనే పాపాన్ని విడచిపెట్టాడు **(renounces his sin),** తన ఒప్పందాన్ని జ్ఞాపకం చేసికొన్నాడు **(remembers his vow),** తన జీవితాన్ని పునః ప్రతిష్టించుకున్నాడు **(rededicated his life)** (2:8,9). యోనా తన ప్రార్థన ముగింపులో మానవుల పట్ల దేవుని ఉద్దేశం మరియు ప్రణాళికనంతటిని నాలుగు మాటల్లో చెప్పాడు. **"యోహోవా యొద్దనే రక్షణ దొరుకును"** (యోనా 2:9; కీర్త 3:8; యోష 43:11; ఎఫె 2:8,9).

దేవుడు మత్స్యమునకు ఆజ్ఞ ఇవ్వగా అది యోనాను నేలమీద కక్కివేసింది. ఈ గ్రంథమంతటిలో ఒక్క యోనా తప్ప, సమస్తము దేవుని ఆజ్ఞకు లోబడ్డాయి.

## C. యోనా ప్రకటన : (దేవుని శక్తి ప్రదర్శించబడుట) 3 అధ్యా

దేవుడు అవిధేయులైన తన సేవకులను అంత తేలిగ్గా వదలుకోడు అన్న సత్యాన్ని ఈ భాగం బోధిస్తుంది (ఉదా: మోషే (నిర్గ 3:11; 4:10,13) యిర్మీయా (1:6); పేతురు (మత్త 26:34,35) ఇతర శిష్యులు (యోహా 21:1-4) యోహాను అనబడిన మార్కు (అపో.కా. 13:13; 15:37-39 **II** తిమో 4:11). తన సేవకులను ఎలా విధేయులుగా చేయాలో దేవునికి తెలుసు గనుక మళ్ళీ యోనానే పంపించాడు. ఇందులో దేవుని దీర్ఘ శాంతం కనిపిస్తుంది.

1. **హెచ్చరిక (3:1-4) :** నీనెవె పట్టణం మూడు దినముల ప్రయాణమంత పరిమాణం గలది. యోనా ఆ పట్టణంలో ఒక దిన ప్రయాణమంత దూరం మాత్రమే సంచరించి, ఇక నలువది దినాలకు ఆ పట్టణం నాశనమౌతుందని ప్రకటించాడు. దుష్టులైన నీనెవెవారు దేవుని మాట ఎలా విన్నారు? యోనా వారిని ఎలా ఆకర్షించాడు? బహుశా యోనా తాను ఎలా బ్రతికించబడ్డాడో చెప్పి ఉండవచ్చును. దేవుని మాటకు అవిధేయులైతే వచ్చే శిక్షను గూర్చి తన అనుభవంలో నుండి వివరించి ఉండవచ్చు.

2. **నీనెవె పట్టణస్తులు దేవుని నమ్ముట (3:5-10) :** యోనా ప్రకటన విన్న నీనెవె ప్రజలు దేవుని యందు విశ్వాసముంచారు. వారి విశ్వాసాన్ని ఉపవాసం ద్వారా ప్రదర్శించారు. నీనెవె పట్టణపు రాజు, ప్రజలు తమ దుర్మార్గములను విడచిపెట్టి దేవుని క్షమాపణ కోరాలని ప్రోత్సహించాడు. యోనా ఒక దిన ప్రయాణమంత దూరం ప్రకటిస్తే రాజు యొక్క దూతలు మిగతా రెండు దినాల ప్రయాణమంత దూరం ప్రకటించారు. ఈ పట్టణం యొక్క మార్పు పాత నిబంధన లోని భౌతికపరమైన అద్భుతాలన్నిటికన్న, క్రొత్త నిబంధనలోని ఆత్మీయ అద్భుతాలన్నిటి కన్న గొప్ప అద్భుతం. సాక్షాత్తు యేసు క్రీస్తు బోధించినా, అపొస్తలులు బోధించినా దేవుని ప్రజలైన వారే మారలేదు, వాక్యానికి ప్రతిస్పందించలేదు. నీనెవె వారు అన్యులే అయనా దేవుని విశ్వసించారు. కనుక వీరు విమర్శ దినాన ఈ తరము వారి మీద నేరస్థాపన చేస్తారు (మత్త 12:41). దేవుడు న్యాయవంతుడు గనుక మనుష్యుల పాపాన్ని బట్టి వారిని శిక్షించాలనుకొన్నా, వారు పశ్చాత్తాపపడితే క్షమిస్తాడు (యిర్మీ 18:7,8; యెహె 18:21-23; 33:10,11, 14-16). నీనెవె వారు తమ చెడునడతలను మానుకొన్నందుకు దేవుడు తాను చెప్పిన కీడు చేయక మానుకొన్నాడు (3:10).

## D. యోనా చింతాక్రాంతుడగుట : (దేవుడు జాలిని ప్రదర్శించుట) 4 అధ్యా

ఈ అధ్యాయం అదనంగా చేర్చబడినట్లు అనిపిస్తుంది. ఎందుచేతనంటే, యోనా తన పని పూర్తి చేసాడు. నీనెవె రక్షించబడింది. నీనెవె సమస్య పరిష్కారమైనది గనుక ఇక ఈ గ్రంథం ముగించబడాలి. అయితే ప్రస్తుతం యోనానే దేవునికి ఒక సమస్యగా

మారాడు. దుర్మార్గమైన పట్టణంలోని పాపులందరి కంటె, సులభంగా వెనుకకు జారిపోయే ఈ ప్రవక్తతోనే దేవునికి ఎక్కువ సమస్య వచ్చింది.

1. **నీనెవె పట్టణమును బట్టి యోనా దుఃఖించుట (1:1-5) :** యోనా స్థానంలో మరెవరైనా ఉంటే, ఆ పట్టణం మార్పు చూసి ఎంతో సంతోషించేవారు. వెళ్ళి అందరికీ చెప్పేవారు. కాని యోనా మూతి ముడుచుకున్నాడు. 2వ అధ్యాయంలో నా ప్రాణాన్ని కాపాడుమని ప్రార్థించినవాడు ఇప్పుడు, నన్ను చంపుమని దేవుణ్ణి అడుగుతున్నాడు. పలు కారణాలను బట్టి నిరాశకు గురై చావుమేలు అనుకొన్న భక్తులు లేకపోలేదు (సంఖ్యా 11:15; I రాజు 19:4; యిర్మీ 20:14-18). కాని యోనా ఉద్దేశం వేరు. నీనెవె ప్రజల విషయం దేవుడు కోరినట్లు అతడు కోరలేదు. దేవుని ప్రవర్తన తన ఇష్టానికి వ్యతిరేకంగా ఉన్నందు వల్ల ప్రాణంపై విరక్తి కలిగింది. దేవుని సుగుణాలన్నీ యోనాకు తెలుసు (4:2) కాని అవి ఇశ్రాయేలు జాతికి తప్ప మరెవరికీ చెందకూడదన్న స్వభావం అతనిలో ఉంది.

2. **యోనా సొరచెట్టు క్రింద నేర్చుకొనుట (4:6-11) :** ఊరిబయట పందిలి వేసికొని నీనెవె పట్టణానికి ఏమి సంభవిస్తుందోనని యోనా కనిపెట్టుకొని ఉన్నాడు. నీనెవె ప్రజలమార్పు స్థిరమైనదో కాదో చూడాలనుకొన్నాడు ఎలాగైనా వారి నాశనాన్నే కోరాడు. యోనాకు నీడ కల్పించడానికి దేవుడు సొరచెట్టును సిద్ధపర్చాడు. యోనా హృదయం దేవుని హృదయంతో కలవడానికి దేవుడు తుఫానును, చేపను, సొరచెట్టును సిద్ధపర్చాల్సివచ్చింది. యోనా సొరచెట్టును బట్టి సంతోషించాడు, (4:6) తన వ్యక్తిగత సౌకర్యాలను గూర్చి శ్రద్ధ కలిగి ఉన్నాడు గాని ప్రజల రక్షణ విషయం శ్రద్ధలేదు. సౌకర్యాలలో ఆనందం ఉన్నదిగాని ఆత్మల పట్ల భారంలేదు. మరునాడు దేవుడు ఒక పురుగును ఏర్పరచగా అది ఆ చెట్టును తొలిచివేసింది. (4:7) దేవుడు ఎంత సునాయాసంగా సౌకర్యాలను ఏర్పరచగలడో, తన బిడ్డలకు గుణపాఠం నేర్పేందుకు అంత సునాయాసంగా వాటిని తొలగించగలడు. యోనాకు మళ్ళీ చావాలనిపించింది. (4:8) అందుకు కారణం సొరచెట్టుకాదు గాని అతని హృదయం దేవుని హృదయంతో కలవలేదు. దేవుడు మనం కోరినట్లు చేయకపోతే దేవునిపై కోపగించుకొంటాం. యోనా అలాగే కోపగించుకున్నాడు. అయితే దేవుడు కయీనును ప్రశ్నించినట్లు ప్రశ్నించాడు. (4:9). ఈ అధ్యాయం ముగింపులో దేవుడు చెప్పిన మాటలు యోనా మొండి వైఖరిని, శరీర సంబంధమైన మనస్సును మెత్తన చేసాయి. (4:10,11) వాస్తవంగా చూస్తే ఈ లోకంలో మన సౌకర్యార్థం కల్పించబడినవన్నీ గతించిపోయేవే (I యోహా 2:17) కనుక మనం వాటిపై శ్రద్ధ చూపక, దేవుడు వేటి విషయం శ్రద్ధ కలిగి ఉన్నాడో వాటిపైననే మన హృదయాన్ని నిలపాలి. ఒకవేళ మనకున్న సౌకర్యాలు తొలగించబడినా, యోబులాంటి మనస్తత్వం కలిగి ఉండాలి. (యోబు 1:21,22).

★ ★ ★ ★ ★

# గొప్ప క్షమాపణ

## మీకా గ్రంథ సంగ్రహ సమీక్ష

**I. ఉపోద్ఘాతం :**

1. **గ్రంథకర్త :** ఉత్తర ఇశ్రాయేలు రాజ్యానికి దేవునిచే పంపించబడిన చివరి ప్రవక్త మీకా. అంత మాత్రమే కాదు ఉత్తర మరియు దక్షిణ రాజ్యానికి పంపించబడిన ఏకైక ప్రవక్త. మీకా ఈ గ్రంథాన్నంతా వ్రాయలేదని, 1:2 నుండి 2:10 వరకు, మరియు 4,5 అధ్యాయాల్లో కొన్ని భాగాలు మాత్రం వ్రాసాడని కొందరు పండితుల అభిప్రాయం. మిగతా భాగాల శైలి వేరుగా ఉన్నది. అయితే పదేపదే చేసిన తీర్పును గూర్చిన హెచ్చరికలు, దేవుని కరుణ, నిరీక్షణలను గూర్చిన వాగ్దానాలు, పుస్తకంలోని భావాల ఐక్యతకు మరియు, 8వ శతాబ్దపు రచన అనడానికి ఆధారాలుగా ఉన్నాయి.

2. **గ్రంథ రచన కాలం :** మీకా యోతాము, ఆహాజు, హిజ్కియా అనే యూదా రాజుల కాలంలో, అనగా క్రీ.పూ. 742-687 సం॥ల మధ్యకాలంలో ప్రవచించాడు. ఇతడు హోషెయ, ఆమోసు మరియు యెషయా ప్రవక్తల సమకాలికుడు, అనగా 8వ శతాబ్దానికి చెందినవాడు గనుక ఈ గ్రంథాన్ని 8వ శతాబ్దపు ముగింపులో వ్రాసి ఉండవచ్చును.

3. **ప్రవక్త జీవితం :** మీకా, యూదా పల్లపు భూముల్లోని, మోరషెతు గ్రామానికి చెందినవాడు. ఈ గ్రామం యెరూషలేమునకు నైరుతి దిశలో 20 మైళ్ళ దూరంలో ఉన్న లాకీషు దగ్గర ఉన్నది. I రాజు 20:35 లోని (పేరు చెప్పబడని) అనామక ప్రవక్త ఇతడే అయి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం, ఇతడు గ్రామీణ ప్రాంతానికి చెందినవాడైనా, పట్టణాలలో ప్రకటించాడు గనుక పట్టణ ప్రవక్త అని కూడ పిలువబడ్డాడు. వ్యక్తిగతంగా మీకా మోమాటము లేనివాడు, ప్రేమగలవాడు, సున్నిత హృదయుడు.

4. **ప్రవక్త సందేశం :** ఇతడు ప్రధానంగా తీర్పును గూర్చే ప్రకటించాడు గనుక తీర్పు ప్రవక్తగా కూడా ఎంచబడ్డాడు. మీకా సందేశంలో శిక్షను గూర్చిన ప్రకటన మరియు ఆదరణ సరిసమానంగా ఉన్నాయి. శాశ్వతుడైన దేవుని కనికరం మరియు తీర్పుల మిశ్రమమే మీకా గ్రంథం.

5. **మూలాంశం :** యెహోవాలాగ ప్రకటించగల, ప్రవచించగల, ప్రాధేయపడగల, క్షమించగల దేవుడెవరు? అన్నదే ఈ గ్రంథ సారాంశం.

6. **మూలవచనం :** "వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు" (మీకా 7:18).

## II. గ్రంథ విశిష్ఠత :

చిన్న పుస్తకమైనా, ఉత్తర, దక్షిణరాజ్యాల నాశనం, బబులోను చెర, చెర నుండి తిరిగి వచ్చుట, క్రీస్తు జన్మ మరియు భవిష్యత్ పాలనను గూర్చిన సందేశమంతా ఇమడ్చబడిన గ్రంథం మీకా. యెషయా ప్రవచనాలకు మరియు మీకా ప్రవచనాలకు పోలికలున్నందు వల్ల మీకా గ్రంథాన్ని యోషయా ప్రవచనాల సూక్ష్మ రూపముగా పరిగణిస్తారు. ఈ పుస్తకంలోని చివరి వచనాలను యూదులు ప్రతి ఏటా ప్రాయశ్చిత్త దినాన సాయంకాలపు ఆరాధనలో చదువుతారు. ఇందులో మీకా చెప్పిన మూడు ప్రధాన ప్రసంగాలున్నాయి. మొదటిది సకల జనులను, రెండవది ఇశ్రాయేలు నాయకులను, మూడవది ఇశ్రాయేలు జాతిని ఉద్దేశించి చెప్పబడ్డాయి. ప్రతి ప్రసంగం **"ఆలకించుడి"** అన్న మాటతో ఆరంభించబడడం గమనార్హం (1:2; 3:1; 6:1). మీకా ప్రవచనాలను గూర్చి బైబిలులో మూడు పర్యాయాలు ప్రస్తావించబడింది (యిర్మీ 26:18లో మీకా 3:12; మత్త 2:5లో మీకా 5:2; మత్త 10:35 లో మీకా 7:6).

## III. గ్రంథ విభజన :

మీకా దేవుని గూర్చి వివరించిన విధానాన్ని బట్టి ఈ గ్రంథాన్ని 4 భాగాలుగా విభించ వచ్చును. ఈ 4 భాగాలలో దేవుడు ప్రకటించువానిగా, ప్రవచించువానిగా, ప్రాధేయపడు వానిగా, మరియు క్షమించేవానిగా వర్ణించబడ్డాడు.

### A. గత పాపాలను బట్టి భవిష్యత్తులో రానున్న తీర్పును ప్రకటించుట 1-3 అధ్యా

1. షోమ్రోనుతో ప్రారంభించి యెరూషలేమువరకు గల ప్రాంతాలను గూర్చిన మొదటి సందేశం (1 అధ్యా)
2. ప్రత్యేక పాపాలను వివరించే రెండవ సందేశం (2 అధ్యా)
3. అధికారుల పాపాన్ని ఖండించే మూడవ సందేశం (3 అధ్యా)

### B. గతంలో చేయబడిన వాగ్ధానాలను బట్టి భవిష్యత్తులో పొందబోయే మహిమను గూర్చి ప్రవచించుట 4,5 అధ్యా

1. అంత్య దినాలను గూర్చిన ప్రవచనాలు (4 అధ్యా)
2. యేసు మొదటి రాకడను గూర్చి ప్రవచనం (5 అధ్యా)

### C. గత విమోచన జ్ఞాపకం చేసికొని ప్రస్తుతం పశ్చాత్తాపపడమని ప్రాధేయపడుట - 6 అధ్యా

### D. దేవుడు ఎవరు ? ఏమి చేయగలడన్న దానిని బట్టి దోషాలన్ని క్షమించుట - 7 అధ్యా

## IV. మీకా గ్రంథం సంక్షిప్త వివరణ :

### A. గత పాపాలను బట్టి భవిష్యత్తులో రానున్న తీర్పును ప్రకటించుట.

ఈ భాగంలో మీకా ప్రవక్త షోమ్రోను మరియు యెరూషలేమును ఉద్దేశించి చెప్పిన మాటలు, (1:1-7). మీకా ప్రలాపం (1:8-6), ప్రత్యేక పాపాల వివరణ (2:1-11) శేషమునకు ఇవ్వబడిన వాగ్దానం (2:12), అధికారుల పాపాన్ని ఖండించడం (3:1-12), మొదలైన అంశాలున్నాయి.

1. **షోమ్రోను మరియు యెరూషలేమును గూర్చిన మాటలు (1:1-7) :** ఈ సందేశం రెండు ప్రధాన పట్టణాలకు రానున్న తీర్పును గూర్చినదే అయినప్పటికిని, దానిని లోకమంతా వినాలి (1:2) ఎందుకంటె వారు కూడ అదే పాపాన్ని చేస్తున్నారు. కనుక ఈ సందేశం ఈనాడు కూడ సకల జనులకు వర్తిస్తుంది. (యెష 1:2). ఇక్కడ పేర్కొనబడిన ఉన్నత స్థలాలు పర్వతాలు కావచ్చును లేక విగ్రహారాధనస్థలాలు కూడ కావచ్చును. షోమ్రోను మరియు యోరూషలేము పట్టణాలు రెండు కొండలపైన కట్టబడ్డాయి (**I** రాజు 16:24; ఆది 22:2; **II** సమూ 5:6). అంతమాత్రమే కాదు ఈ రెండు పట్టణాలలోను ఉన్నత స్థలాల్లో విగ్రహారాధన జరిగించబడింది. ఇవే వారి పాపానికి కారణమయ్యాయని ప్రవక్త స్పష్టం చేస్తున్నాడు (1:5). షోమ్రోను నాశనమును గూర్చిన మీకా ప్రవచనం (1:6), హోషెయ పరిపాలన కాలంలో నెరవేర్చబడింది (**II** సమూ 5:6). అంత మాత్రమే కాదు ఈ రెండు పట్టణాలలోను ఉన్నత స్థలాలలో విగ్రహారాధన జరిగించబడింది. ఇవే వారి పాపానికి కారణమయ్యాయని ప్రవక్త స్పష్టం చేస్తున్నాడు (1:5). షోమ్రోను నాశనమును గూర్చిన మీకా ప్రవచనం (1:6), హోషెయ పరిపాలన కాలంలో నెరవేర్చబడింది (**II** రాజు 17:5-20).

2. **మీకా ప్రలాపము (1:8,9) :** మీకా తన దుఃఖాన్ని వివరించిన విధానం యోబు వివరణ లాగే ఉన్నది (యెబు 30:29). యిర్మీయా కూడ ఇలాగే ప్రలాపించాడు. (యిర్మీ 9:1). ప్రవక్త ప్రజలతో దేవుని కఠినమైన మాటలు చెప్పాలంటే ఆ వ్యక్తికి మృదువైన హృదయం ఉండాలి. దేవుడు తన ప్రజలకు తీర్పు తీర్చక ముందు, వారి పాపాన్ని గూర్చి దేవుడు ఎలా బాధపడుతున్నాడో వారు తెలిసికోవాలన్నదే దేవుని కోరిక. దేవుడు తీర్పు తీర్చడంలో ఆనందించడు. కాని పాపాన్ని శిక్షించాలి గనుక తీర్పు వస్తుంది. అయినా ఒకవేళ మారతారేమోనని ఆయన జాప్యం చేస్తాడు. అయితే హద్దు మీరితే దాన్ని ఎవరూ ఆపలేరు. (1:9).

3. **షోమ్రోను, యెరూషలేముతో పాటు దేవుని తీర్పుకు గురైన పట్టణాలు (1:10,12) :** ఈ భాగంలో పది పట్టణాలు పేర్కొనబడ్డాయి. అందులో కొన్ని పాలస్తీన పటంలో లేవు. ఈ పట్టణాలన్నీ ఉత్తరాన షోమ్రోను మొదలుకొని దక్షిణాన యెరూషలేము వరకు ఉన్నాయి. ప్రవక్త ఈ పట్టణస్తులతో చెప్పిన మాటలు విచిత్రంగా ఉన్నాయి. గాతు

(1:10) అంటే ఏడ్చేపట్టణం అని అర్థం. కాని వారు ఏడ్వరు. బేత్లెయఫ్ర అంటే ధూళిపట్టణం. దాని ధూళిలో వారు పొర్లాల్సివస్తుంది. ధూళివేసుకోవడం బహు దుఃఖానికి సూచన. షాఫీరు (1:11) అంటే అందమైన పట్టణం. కాని అది దిగంబరత్వంతో అందవిహీనంగా మారుతుంది. శత్రువులు చెరగా తీసికొనిపోయే విధానమిది. (యెష 20:4; యెహె. 16:39; నహూ 2:7) మారోతు అంటే (1:12) చేదు, లేక కీడు, లాకీషు గుఱ్ఱాల పట్టణం (1:13). యెరూషలేముకు నైరుతి దిశలో నున్న వీరే మొట్టమొదట యూదయలో విగ్రహారాధనను పరిచయం చేసారు. అక్జీబు అంటె అబద్ధపు పట్టణం (1:14). ఇది పేరుకు తగినట్టే ఉన్నది. వీరు ఉత్తర రాజ్యానికి సహాయం చేస్తామని చెప్పి మోసం చేసారు. 1:15లోని హక్కుదారుడు దావీదు వంశం నుండి రాబోతున్న యేసు ప్రభువు. తలబోడి చేసికొనుట దుఃఖానికి సూచన. ఇది పిల్లలను పోగొట్టుకొన్నందుకు సలిపే దుఃఖం. ఈ పద్ధతిని గూర్చి మీకా సమకాలికుడైన యెషయా కూడ వివరించాడు (యెష 15:2).

4. **ప్రత్యేక పాపాలను గూర్చిన వివరణ (2:1-11) :** మొదటి అధ్యాయంలో విగ్రహారాధనను ఖండించిన మీకా రెండవ అధ్యాయంలో, ఒకరికొరకు వ్యతిరేకంగా చేసిన పాపాన్ని ఖండిస్తున్నాడు. ఈ అధ్యాయంలో పేర్కొన్న పాపాలను, కీడును ఇశ్రాయేలీయులు బాగా యోచించి చేసారు (2:1). కనుక దేవుడు వారికి కూడ కీడు చేయనుద్దేశించాడు (2:3). యధారాజ తథాప్రజ అన్నట్లు ఆహాబు మరియు యెజెబెలు (Iరాజు 21:1-16) లాగా ఇతరుల ఇండ్లను, భూములను అన్యాయంగా ఆక్రమించుకున్నారు (2:2). కనుక వారి స్వాస్థ్యాన్ని, భూములను దేవుడు అన్యులకు ఇస్తాడు (2:4). దేవుని సందేశాన్ని ఆయన సేవకుల ద్వారా వినే భాగ్యం ఆయన ప్రజలకు తప్ప లోకంలో మరెవరికీ లేదు. వాటిని ఇష్టపడిన వారికి అవి క్షేమ సాధనాలు (2:7). అయితే అది వారికి ఇష్టం లేదు (2:5-7). కనుక దేవుడు వారి మధ్య నుండి ప్రవచనాత్మను తీసివేస్తాడు. దేవుడు అలా చేస్తాడా? అని వారు అనుకొంటె అది పొరపాటు. దుర్మార్గులు ప్రవక్తల నోరు మూయించినంత మాత్రాన తీర్పును తప్పించుకోలేరు. పైగా తప్పనిసరిగా తమపైకే తీర్పు వచ్చేలా చేసుకొంటున్నారు. (2:10) వారు తమ పాపాలను సమర్థించే వారినే ప్రవక్తలుగా నియమించుకున్నారు (2:11).

5. **శేషమును గూర్చిన వాగ్దానం (2:12-13) :** మేఘావృతమైన తుఫానులో సూర్యకిరణం లాగ ఈ వాగ్దానం ఇవ్వబడింది. ఈ సమకూర్పు బబులోను చెరనుండి తిరిగి రాబోయే సంఘటనను గూర్చి, లేక ప్రస్తుత కాలంలో తిరిగి వస్తున్నయూదులను గూర్చినది కాదు గాని, యుగాంతంలో అనగా వెయ్యేండ్ల పాలనలో జరుగబోయేది. వారు సమకూర్చబడినపుడు (1:12) 23వ కీర్తన నెరవేర్చబడుతుంది. ప్రాకారాలను పడగొట్టేవాడు, రాజు యెహోవాయే.

**6. ప్రధానుల మరియు అధిపతుల పాపాన్ని ఖండించుట (3:1-12) :**

**ఎ. ప్రధానుల పాపం (3:1-4) :** ప్రజలకు ఆత్మీయ నాయకులుగా ఉన్న వీరు పేదల పట్ల ప్రవర్తించిన తీరు బహుక్రూరమైనది. ప్రజలకు న్యాయం చేయాల్సిన వీరు మేలు చేయనెరిగి కూడ దానిని అసహ్యించుకొని కీడు చేయడానికే ఇష్టపడ్డారు. కనుక వారు మొఱపెట్టినప్పుడు దేవుడు తన ముఖాన్ని త్రిప్పుకొంటాడు. దేవుణ్ణి నిర్లక్ష్యం చేసే వారి మనవిని దేవుడు వినడు.

**బి. ప్రవక్తల పాపం (3:5-7) :** ప్రజలను సత్యంలోనికి నడిపించాల్సిన ప్రవక్తలు వారిని దానికి దూరంగా తీసికొనిపోయారు (యెష 3:12; 9:16). ఓవైపు అష్షూరీయులు ఉత్తరరాజ్యం పైకి రాబోతూ ఉండగా వారు సమాధానాన్ని ప్రకటిస్తున్నారు. కనుక ఇశ్రాయేలు ప్రవక్తల అబద్ధాలకు ఫలితంగా వారికి దర్శనాలు కలుగకుండ చేసాడు దేవుడు. గ్రీకు భాషలో ఉపయోగించబడిన ఈ మాట అర్థాన్ని బట్టి చెప్పాలంటే ప్రవచనాలు నిరర్ధకమౌతాయి లేక నిలిచిపోతాయి. అవి నెరవేర్చబడడం ద్వారానైనా లేక దేవుడు మౌనంగా ఉండడం వలననైనా అలా జరుగవచ్చును. ఉత్తర రాజ్యానికి మీకానే చివరి ప్రవక్త. దక్షిణ రాజ్యానికి మలాకీ చివరి ప్రవక్త. అతని తదనంతరం బాప్తిస్మమిచ్చు యోహాను వరకు 400 సం॥లు ప్రవచనాలు లేని చీకటి కాలం వచ్చింది. దేవుని వాక్యం పట్ల ప్రజలకు మరియు ప్రవక్తలకు గల నిర్లక్ష్య భావమే అందుకు కారణం. అలాంటివారు ఈ దినాల్లోను ఉన్నారు.

**సి. మీకా ప్రత్యేకత (3:8) :** మీకా ఇతర ప్రవక్తలకు భిన్నంగా ఉన్నాడు. ప్రజల అపరాధాలను గూర్చి చెప్పడమే ప్రవక్త ప్రథమ కర్తవ్యం (యోష 58:1). అందుకు దేవుని ఆత్మ శక్తి, ధైర్యం అవసరం. (నిర్గ 31:3, యెష 48:16; యెహె 2:2; లేక 4:6; ఎఫె 5:18; I పేతు 1:11).

**డి. అధిపతుల పాపం (3:9-11) :** అధిపతులు, ప్రధానులు, యాజకులు మరియు ప్రవక్తలందరిలో ఒకే పాపం కనిపిస్తున్నది. అదే దురాశ. దేశంలో లౌకిక (సివిల్) మరియు మత నాయకత్వం చెడ్డదైతే ఏ పరిపాలనా విధానం కూడ ఫలితాన్ని ఇవ్వదు.

ఇశ్రాయేలు నాయకులంతా తమ స్వలాభమే కోరుతున్నారు గాని ప్రజల క్షేమాన్ని కోరడం లేదు. పైగా యెహోవా మనమధ్య ఉన్నాడు గనుక మనకు ఏ కీడు రాదు అనుకొని భ్రమపడుతున్నారు. 3:12లో చెప్పబడిన ప్రవచనం, నెబుకద్నెజరు కాలంలో కొంత వరకు నెరవేర్చబడింది. (నెహె 1:3) అటు పిమ్మట కీ.శ. 70 సం॥ రోమీయుల కాలంలో కొంత వరకు నెరవేర్చబడింది. (నెహె 1:3) అటు పిమ్మట (కీ.శ. 70 సం॥ రోమీయుల కాలంలో కొంత వరకు నెరవేర్చబడింది. టైటస్ అనే వ్యక్తి రాతి మీద

రాయి లేకుండ చేసాడు. రూఫస్ అనే వ్యక్తి దాని పునాదులను త్రవ్వివేసాడు. మీకా చెప్పిన ఈ ప్రవచనమును గూర్చి అతని తదనంతరం వంద సంవత్సరాల తరువాత యిర్మీయా కాలంలో కూడ జ్ఞాపకం చేసికోబడింది. (యిర్మీ 26:18).

**B. గతంలో చేసిన వాగ్ధానాలను బట్టి భవిష్యత్తులో పొందబోయే మహిమను గూర్చిన ప్రవచనాలు (4, 5 అధ్యా)**

**1. అంత్యదినాలను గూర్చిన ప్రవచనాలు (4 అధ్యా) :** మీకా ప్రవచనాలను, యూదులు దినమును లెక్కించే విధానంతో పోల్చవచ్చును. యూదుల దినము సాయంత్రం (చీకటి)తో ప్రారంభమై ఉదయం (వెలుగు)తో ముగుస్తుంది. మొదటి మూడు అధ్యాయాలలో తీర్పును ప్రకటించిన మీకా, ఇప్పుడు భవిష్యత్ మహిమను గూర్చిన ఒక వెలుగు కిరణాన్ని ప్రసరింపజేస్తున్నాడు. లోతైన బావిలోపలికి వెళ్ళిపైకి చూస్తే నక్షత్రాలు కనబడినట్లు అట్టడుగు స్థాయికి తీసుకొని పోబడిన ఇశ్రాయేలీయులు భవిష్యత్ వెలగును చూసేలా చేసాడు. మీకా 4:1-3 లో చెప్పబడిన ప్రవచనం అతి ప్రాముఖ్యమైనది (యెష 2:2-4). ఇది అంత్యకాలానికి సంబంధించినది. ఎందుచేతనంటే, ప్రస్తుతం ప్రపంచంలోని వారంతా దేవుణ్ణి ఆరాధించడానికి యెరూషలేమునకు వెళ్ళడం లేదు. శాంతి స్థాపకుడైన యేసు పాలన వచ్చేంతవరకు యుద్ధాలు ఆపబడవు. ఈ పాడు ప్రపంచంలో ఉన్నంత వరకు ఆయుధాలు, యుద్ధాలు అవసరమే (లూకా 11:21). మానవుడు తన భద్రత కోసం కల్పించుకొన్న సాధనాలన్నీ ఆయన పాలనలో నిరుపయోగంగా ఉంటాయి. గతంలో ఇతర దేవుళ్ళను వెంబడించిన ఇశ్రాయేలీయులు భవిష్యత్తులో యెహోవా నామమున నడుస్తారు (4:4,5). 4:6,7 వచనాలు వెయ్యేండ్ల పాలనకు సంబంధించినవి. ఇశ్రాయేలీయులను దేవుడే బాధించాడు. తిరిగి సమకూర్చాడు. దేవుణ్ణి తెలిసికోడానికి, విధేయత చూపించడానికి శ్రమలు ఒక అవకాశంగా ఉంటాయి. గనుక కష్టాలలో దేవునిపై నిందవేయవద్దు. దేవుని గూర్చిన జ్ఞానం గలవారు ఆయన క్రమశిక్షణను తప్పించుకోరు (హెబ్రీ 12:5,6). ఈ అధ్యాయం ప్రారంభంలో భవిష్యత్తులోని మహిమను గూర్చి చెప్తూ ప్రస్తుతం త్వరలో ఏమి సంభవించబోతుందో చెప్తున్నాడు (4:9,10). ఇది బబులోను చెరకు సంబంధించినది. ఈ అనుభవం ప్రసూతి స్త్రీ వేదనకు పోల్చబడింది. ప్రసూతి స్త్రీ వేదన వంటి శ్రమలు, సంతోషముతో అంతమొందుతాయి. అక్కడే వారికి రక్షణ మరియు విమోచన ఇవ్వబడింది (యెషయా 44:28; I దిన.వృ. 36:22,23). 4:11-13లోని ప్రవచనం, చాలకాలం తరువాత జరుగబోయే హార్మెగిద్దోను యుద్ధమును గూర్చినది (యోవే 3 అధ్యా, జెక 12, 14 అధ్యా; యెహె 38,39 అధ్యా). దేవుని ఉద్దేశాలను ఎరుగక ఇశ్రాయేలును అవమానపరిచిన అన్య రాజ్యాలన్నిటిని దేవుడు కళ్ళములో పనలు కూర్చునట్లు

కూరుస్తాడు. ఇశ్రాయేలీయులు వారిని కళ్ళముత్రొక్కినట్లు త్రొక్కుతారు. ఈనాడు ఇశ్రాయేలు బలహీన దేశం, ఇతర దేశాలపై ఆధారపడుతుంది. కాని భవిష్యత్తులో కేవలం దేవుని పైననే ఆధారపడతారు (కీర్త 75:6,7). హర్‌మెగిద్దోను యుద్ధంతో మహాశ్రమల కాలం ముగించబడుతుంది.

2. **యేసు క్రీస్తు మొదటి రాకడను గూర్చిన ప్రవచనాలు (5 అధ్యా) :** మీకా 5వ అధ్యాయం, దక్షిణ రాజ్యానికి చివరి రాజైన సిద్కియా చెరకు తీసుకొని పోబడిన సందర్భంతో ప్రారంభించబడింది (I రాజు 25:7). దావీదు వంశస్తుల పాలనను గూర్చిన దేవుని వాగ్ధానం యెహోయాకీముతో పూర్తి అయింది. ఇక అసలైన వాగ్ధానం అనగా, యుగయుగాలు రాజ్యాన్ని ఏలేవాడు వస్తాడన్న వాగ్ధానం నెరవేరబోతుంది. అదే క్రీస్తు మొదటి రాకడ. యెషయా యేసుక్రీస్తు కన్యకు జన్మిస్తాడని చెప్పాడు (యెష 9:6) మీకా ఆయన జన్మ స్థలాన్ని గూర్చి చెప్పాడు (5:2). ఆయన బేత్లెహేములో పుట్టడానికి, దేవుడు పరిస్థితులన్నిటిని అనుకూల పరచాడు (లూకా 2:1-7). ఆయనే దేవుని కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోయేవాడు.

ఆయన ఈ లోకంలో జన్మించుట అన్నది ఆయన మానవత్వాన్ని గూర్చినది మాత్రమే. ఆయన శాశ్వతుడు అన్నది దైవత్వాన్ని సూచిస్తుంది. ఆయన యుగయుగములు ఉన్న దేవుడు (కీర్త 90:2, సామె 8:23-25). ఆయనే సృష్టికర్త (యోహా 1:3; కొల 1:16). ఆయనే నిత్యుడగు తండ్రి (యెష 9:6; యోహా 8:58; 16:28). ఆయన దేవుని పక్షంగా ఆయన నామ మహాత్యమును బట్టి తన మందను మేపుతాడు (యోహాను 10:11; హెబ్రీ 13:20; I పేతు 5:4తో పోల్చిచూడండి). 5:5-7లోని మాటలు ఆయన ఇవ్వబోయే సమృద్ధిని మరియు సంపూర్ణతను, అన్యజనుల మధ్య ఇశ్రాయేలుకు కలుగబోయే దీవెనకరమైన స్థితిని సూచిస్తున్నాయి. దేవుడు వారిని తలగా ఉంచుతాడు గాని తోకగా ఉంచడు (ద్వితీ 28:13). ఇది వారి భవిష్యత్ స్థితి (5:8,9). ఇంత వరకు ఇశ్రాయేలీయులు తమకు ఆధారముగా చేసికొన్న వాటన్నిటిని ఆయన నాశనం చేస్తాడు (5:10-14). ఆయన ఇశ్రాయేలు శేషానికి మరియు అన్యజనుల శేషానికి సమాధానాన్ని చేకూరుస్తాడు, గాని ఆయన మాట ఆలకించని జనాలకు ప్రతీకారము చేస్తాడు (5:15). బహుశా ఇది మహాశ్రమల కాలాన్ని గూర్చినది కావచ్చు.

## C. గత విమోచనను జ్ఞాపకం చేసికొని, ప్రస్తుతం పశ్చాత్తాపపడమని ప్రాధేయపడుట 6 అధ్యా :

మీకా తన చివరి ప్రసంగం యొక్క ప్రారంభంలో ఇశ్రాయేలీయులకు మరియు లోకంలోని రాజ్యాలన్నిటికి పిలుపునిస్తున్నాడు. ఈ పిలుపు దేవునితో, తమ వ్యాజ్యాన్ని తీర్చుకోడానికి

ఇవ్వబడింది. యెషయా కూడ ఈలాంటి పిలుపునే ఇచ్చాడు (యెష 1:18,19). వారు దేవుని నుండి వైదొలగడానికి, ఆయనను తృణీకరించడానికి కారణమేమని ప్రశ్నిస్తున్నాడు (6:2). ఈ విధమైన ప్రశ్నలే మలాకీ గ్రంథంలో కూడ ఉన్నాయి (మలా 1:6,8; 2:10; 3:8). దేవుని వలన వారికి సమస్య రాలేదు. దేవుడు వారిని ఐగుప్తు నుండి విమోచించాడు. నాయకులనిచ్చాడు. మోయాబురాజైన బాలాకు ఇశ్రాయేలీయులను శపించడానికి బిలామును పంపినపుడు, దేవుడు వారిని దీవించేలా చేసాడు. వీటన్నిటిని ఆయన జ్ఞాపకం చేస్తూ (6:3-5) వారిని తనవైపు తిరగమని ప్రాధేయపడుతున్నాడు. అయితే ప్రజల మనస్సులో దేవుణ్ణి ఎలా దర్శించాలి? ఏమి తీసికొని వెళ్ళాలన్న ప్రశ్నలున్నాయి (5:6,7).

ఇది విగ్రహారాధన యొక్క ప్రభావాన్ని మరియు మనిషి గర్వాన్ని సూచిస్తుంది. సమస్యలొచ్చినపుడు దేవతలకు కోపం వచ్చిందని, వారి కోపం తీర్చడానికి ఏదైనా చెయ్యాలన్నది, మరియు గర్భఫలాన్ని అర్పించాలన్నది అన్యుల పద్ధతి. మనిషిలోని అహం, దేవుని కోసం ఏదో చేయాలని ప్రయత్నిస్తుంది. కాని ఇవేవి దేవునికి సంతోషాన్ని ఇవ్వవు. మనిషిని రక్షించవు. క్రియల ద్వారా రక్షణ దొరకదు కాని రక్షించే విశ్వాసం క్రియలను ఉత్పత్తి చేస్తుంది. వారు ఆ క్రియలను చేయలేకపోవడమే అసలు సమస్య. ప్రవక్త దానికి కారణాన్ని కూడ వివరిస్తున్నాడు. వారు దేవునికి, ఆయన చెప్పి సత్యాలకు దూరంగా ఉన్నారు (6:9-12). న్యాయం, దీనమనస్సు, కనికరం అనేవి మనిషిలో స్వతహాగా లేవు. కనుక తన స్వంత శక్తితో వాటిని అనుసరించలేడు. ఈ లక్షణాలన్ని రక్షించబడిన వ్యక్తులలో పరిశుద్ధాత్మ ఉత్పత్తి చేస్తాడు. (గల 5:22,23; రోమా 4:25) ఇశ్రాయేలీయులలో దేవుడు కోరిన లక్షణాలకు వ్యతిరేకమైనవి ఉన్నాయి. ఆయన వారిని కొట్టి వేయాలనుకొన్నాడు. కాని వారు ఆయన వైపు తిరిగేందుకు అవకాశమిస్తూ, క్రమేణ క్షీణింపజేస్తానన్నాడు (6:13-15). అన్ని విషయాలలో కొరత కలుగజేస్తాడు. 200 సంవత్సరాల క్రితం ఉన్న ఒమ్రీ మరియు ఆహాబు ఇంటివారి క్రియలను, యోచనలను వారు అనుసరించారు కాని దేవుని కట్టడలను అనుసరించలేదు 6:16).

## D. దేవుడు ఏమైయున్నాడో, ఏమి చేస్తాడో, దానిని బట్టి వారి దోషమునంతా క్షమిస్తాడు (7 అధ్యా) :

ఈ అధ్యాయాన్ని 1-6 వచనాల వరకు ఒక భాగంగా 7-20 వరకు రెండో భాగంగా విభజించవచ్చును.

మొదటి భాగంలో దేవుడు తన ప్రజలపై మోపిన నేరాలన్నీ నిర్దుష్టమైనవి. వారి పాపాలు మరియు వాటి విషయం దేవుడు తీసుకోబోయే చర్య, మీకా హృదయాన్ని కదిలించాయి.

అతని బాధను ఎలా వర్ణించాడో చూడండి (7:1 ను యెష 5:4తో పోల్చండి). మానవ స్వభావం ఎంత అపనమ్మకమైందో వర్ణిస్తూ మీకా మానవులెవ్వరినీ, చివరికి స్వంత వారిని కూడ నమ్మవద్దని చెప్పాడు (7:4-6). ఈలాంటి మాటలే యేసు తన శిష్యులతో కూడ చెప్పాడు (మత్త 10:35,36). మనిషి స్వతహాగా విరోధ స్వభావం గలవాడు. కనుక జాగ్రత్తగా ఉండాలి.

రెండవ భాగంలో ప్రవక్త నిశ్చయత మరియు నిరీక్షణ కనిపిస్తున్నది (7:7-12). ఆయన తిరిగి వెలుగులోనికి రప్పిస్తాడని నమ్మాడు. దేవుని పిల్లలందరు తమ శ్రమలలో, చీకటి ఘడియల్లో ఈలాంటి నిరీక్షణనే కలిగి ఉండాలి. అయితే అట్టి స్థితి పొందడానికి దేవునికి దగ్గరగా రావాల్సిన అవసరత (7:7), మరియు పాపాన్ని ఒప్పుకొని సరిచేసుకోవాల్సిన అవసరత (7:9) ఉన్నది. అంత మాత్రమే కాదు దేవుడే మన జీవితంలో వాటిని అనుమతించాడని, అయినా అన్ని పరిస్థితులను తన అదుపులో ఉంచుకొంటాడని నమ్మాలి అప్పుడే అన్నీ సహించగలం. (7:9) మీకా ప్రజల పాపాలను తన వ్యక్తిగత పాపంగా పరిగణించి ప్రార్థించాడు (నెహెమ్యా 1:6; దాని 9:11). 7:10-12లో వారు సమకూర్చబడినపుడు అన్యజనులు పొందబోయే అవమానాన్ని గూర్చి చెప్పాడు. అన్యజనులు దేవుని ప్రజలను చూచే విధానం వేరు. వారు దేవుని నీతిని చూడలేరు గాని ఆయన నీతిని బట్టి తన ప్రజలను శిక్షించడం మాత్రమే చూస్తారు గనుక శత్రువులు మీ దేవుడు ఎక్కడ ఉన్నాడు? మీకు ఎందుకు సహాయం చేయడు అని ప్రశ్నిస్తారు, అవమానిస్తారు. వారిని ఐగుప్తు నుండి దేవుడు విడిపించినపుడు అనేక అద్భుతాలు చేసాడు. కాని బబులోను చెర నుండి విడిపించబడడమే ఒక మహాద్భుతంగా ఉంటుంది (7:15). ఐగుప్తు నుండి విమోచన పొందినపుడు జనులందరు భయపడినట్లే (యెహో. 2:10,11). ఇప్పుడు కూడ భయపడతారు (7:16,17). ముగింపులో దేవుని శాశ్వత క్షమాపణ మరియు మార్పు చెందని ఆయన లక్షణాలన్నీ వివరించబడ్డాయి. **ఆయనకు సమానమైన వారెవరూ లేరు. గనుక ఆయనను దేవునిగా కలిగి ఉన్నవారు ధన్యులు** (ద్వితీ 33:29; కీర్త 33:12).

★ ★ ★ ★ ★

# గొప్ప ఆదరణ

## నహూము సంగ్రహ సమీక్ష

**I. ఉపోద్ఘాతం :** బైబిలులో ఉన్న పుస్తకాలన్ని గొప్ప పుస్తకాలే గనుక నహూము కూడ చిన్న పుస్తకమైనా, గొప్ప పుస్తకమే. ఎందుచేతననగా అది బైబిలులో ఉన్నది మరియు ఒక ప్రత్యేక ఉద్దేశంతో వ్రాయబడింది. కొంత కాలానికి చరిత్రలో జరిగిపోయింది. అయితే ఇప్పుడు, మన కాలంలో మనకు ఇది ఎంత వరకు ఉపయోగకరం? అన్న ప్రశ్నరావచ్చును. బైబిలు ప్రత్యేకత ఏమంటే, అందులోని ప్రతి పుటలో మన కోసం ఒక సందేశం తప్పకుండా ఉంటుంది. అందులో కొన్ని ప్రత్యేకంగా మనలనే సూచించేవి ఉంటాయి. అవన్నీ మనకోసమేనని అంగీకరించే వారికి, అవి ఆశీర్వాదకరంగా ఉంటాయి.

**1. గ్రంథకర్త :** గ్రంథకర్త యొక్క పేరు, ఊరు తప్ప ఇతర వివరాలేమి వ్రాయబడలేదు. నహూము అన్న మాటకు **ఆదరించేవాడని** అర్థం. అతడు ఎల్కోషు వాస్తవ్యుడు. అష్షూరు దేశంలో నీనెవె పట్టణానికి ఉత్తరాన కొన్ని మైళ్ళ దూరంలో ఒక ఎల్కోషు ఉన్నది. కాని పుస్తకంలో ఉన్న అంశాన్ని బట్టి అతడు అక్కడికి వెళ్ళలేదని గ్రహించవచ్చును. ఉత్తర పాలస్తీనాలోని గలిలయలో కూడ ఎల్కోషు అనే గ్రామం ఉన్నది. ఆ గ్రామము నహూము జన్మస్థలమని, తరువాత కాలంలో అది అతని పేరును బట్టి కపెర్నహూము అని పిలువబడిందన్న అభిప్రాయం కూడ ఉన్నది. దక్షిణ పాలస్తీనాలోని యూదయకు దిగువ భాగంలో కూడ ఒక ఎల్కోషు ఉన్నది. నహూము ఉత్తర పాలస్తీనాలో పుట్టి, అతడు పరిచర్య చేసిన కాలం నాటికి యూదాలోని ఎల్కోషుకు వచ్చాడని అనేకుల అభిప్రాయం.

**2. గ్రంథ రచన కాలం :** అష్షూరు రాజైన సన్హెరీబు యెరూషలేముపై దాడి చేసినపుడు బహుషా నహూము ప్రత్యక్ష సాక్షిగా ఉండి ఉండవచ్చునని మొదటి అధ్యాయంలో వ్రాయబడిన వర్ణనను బట్టి తెలుస్తున్నది. దానిని బట్టి అతడు, యెషయా మరియు మీకా ప్రవక్తలకు సమకాలికుడని కొంతమంది అభిప్రాయం, నహూము గ్రంథము యొక్క రచన కాలం గూర్చి పలు అభిప్రాయాలున్నాయి. ఈ గ్రంథములో పేర్కొనబడిన నో ఆమోను పట్టణం (3:8) క్రీ॥పూ॥ 644-636 మధ్య కాలంలో నాశనమైంది. అప్పటికి నీనెవె ఇంకా నిలిచే ఉన్నది. దాని గూర్చి నహూము చెప్పిన వినాశనం క్రీ॥పూ॥ 612 సం॥లో జరిగింది. కనుక ఈ ప్రవచనం దానికి ముందు కాలానికి చెందినది. అనగా యోనా తరువాత 100 సం॥లకు అనగా క్రీ॥పూ॥ 720-636 సం॥లోపు వ్రాయబడి ఉండవచ్చును.

**3. ముఖ్యాంశం :** దుర్మార్గుల్ని శిక్షించడంలోను, తనపై నమ్మిక ఉంచిన వారి పట్ల దయ

చూపించడంలోను దేవుని పవిత్రత వెల్లడి అవుతున్నది. ఈ గ్రంథమంతటిలో ఒకే ఒక అంశం ఉన్నది. నీనెవె దుర్మార్గతను బట్టి కలుగబోయే నాశనం నహూము ముఖ్య సందేశం. నీనెవె పట్టణస్తులకు యోనా మారుమనస్సును గూర్చి ప్రకటించాడు. మారుమనస్సు పొంది కూడ, దేవునికి వ్యతిరేకంగా జీవిస్తున్న వీరిపై రానున్న తీర్పును గూర్చి నహూము చెప్పాడు. నహూము అంటే ఆదరించేవాడని అర్థం కదా? మరి తీర్పును గూర్చి ప్రకటిస్తున్నాడేమిటి? వారి శత్రువు నాశనమవడం మరియు తాము రక్షణ పొందడమన్నది యూదా వారికి ఆదరణ సందేశమే కదా!

## B. గ్రంథ విభజన :

**I.** దేవుని న్యాయం మరియు మంచితనం - 1:1-8

**II.** నీనెవె నాశనం గూర్చి మరియు యూదులకు శుభవార్తనందించుటను గూర్చి తీర్మానించుటలో దేవుడు న్యాయాన్ని మరియు మంచితనాన్ని ప్రయోగించుట - 1:9-15.

**III.** నీనెవెను నాశనం చెయ్యాలన్న తీర్మానాన్ని అమలు పరచుటలో, దేవుని న్యాయం మరియు మంచితనం ప్రత్యక్షపరచబడుట.

1. అష్షూరు సమూల నాశనం చేయబడుట - 2 అధ్యా
2. మానవుల క్రియలకు తగిన శాస్తి చేసే దేవుని చర్యకు న్యాయం చేకూర్చబడింది - 3 అధ్యా

## C. అధ్యాయాల వారిగా, అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. మొదటి అధ్యాయం :

**1. దేవుని న్యాయం మరియు మంచితనం (1:1-8) :** దేవుని ఈ రెండు లక్షణాలు ఎప్పుడూ కలిసే ఉంటాయి. దేవుడు ప్రేమగలవాడైనా, న్యాయవంతుడు గనుక పాపాన్ని శిక్షిస్తాడు. శిక్షించినా వారిని ప్రేమిస్తాడు. మనుషుల్లాగ క్షణికమైన భావోద్రేకాలతో పగతీర్చుకోవాలన్న ఉద్దేశంతో శిక్షించడు. నీనెవె దేవుడు ప్రేమించిన పట్టణం గనుక దానిపై శిక్ష రాకుండ ఉండేందుకే యోనాను పంపించాడు. ఇప్పుడు కూడ, వారు తిరిగి దేవుని వైపు తిరగడానికి అవకాశం ఇచ్చాడు. అయినా వారు వినలేదు. వారికివ్వబడిన సమయం అయిపోయింది గనుక నాశనం తప్పదు. ఈ భాగంలో దేవుని గుణ లక్షణాల వర్ణన ఉన్నది.

**అ. యెహోవా రోషముగలవాడు (1:2) :** దేవుని రోషం కేవలం భక్తికి సంబంధించిన, తప్పని సరియైన లక్షణం. భర్త, లేక భార్య తన జీవిత భాగస్వామి, మరెవ్వరితోను జీవితాన్ని పంచుకోకూడదన్న రోషం కలిగి ఉన్నట్లే, దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు గనుక మన విషయం రోషం కలిగి ఉంటాడు (నిర్గ. 20:5; 34:14; ద్వితీ 4:34). మనకు ఉన్నవేవి ఆయనకు అక్కరలేదు. మనమే ఆయనకు కావాలి. మనల్ని మనం

పాపానికి అప్పగించుకొంటె దేవుడు రోషం వహిస్తాడు (యెహో 24:19; జెక 8:2). దేవుని రోషము అన్నది, తన ప్రజల పట్ల ప్రేమను మరియు వారిని నాశనం జేయ చూచేవారిపైగల కోపాన్ని సూచిస్తుంది.

ఆ. **ఆయన ప్రతికారము చేయువాడు (1:2) :** ప్రతికారము అంటే, తనను తన ప్రజలను వ్యతిరేకించే వారిని న్యాయసమ్మతమైన తీర్పుతో శిక్షించుట. దేవుని పిల్లలకు శత్రువులైన వారందరూ దేవునికి శత్రువులే (ద్వితీ 32:40,41). దేవుడు అనుమతిస్తే తప్ప (సంఖ్యా 31:1-3) మన శత్రువులపై మనం పగతీర్చుకోకూడదు. పగ తీర్చుట దేవుని పని (రోమా 12:19). మనిషి ప్రతికారం, తనకు మరియు ఇతరులకు హాని చేస్తుంది. కాని దేవుడైతే తన చర్యలన్నిటిలో న్యాయవంతుడు గనుక సరైన విధంగా పగ తీరుస్తాడు. అంత మాత్రమే కాదు, ఆయన ప్రతీకారమును బట్టి ఆయన మహిమ పరచబడతాడు (యెహె 38:18-23; 39:21).

ఇ. **యెహోవా దీర్ఘశాంతుడు (1:3) :** ఏ వ్యక్తికైనా, దేశానికైనా పశ్చాత్తాపపడడానికి దేవుడు సమయాన్ని ఇస్తాడు (**I** పేతు 3:19; **II** పేతు 3:9). ఆయన త్వరగా కోపపడడు (మీకా 7:18). ఎవరైనా సరే, పాపంలో కొనసాగడానికి ఒక హద్దు అంటూ ఉంటుంది. ఆ హద్దును మీరినపుడు దేవుడు దీర్ఘశాంతుడైనప్పటికినీ, తప్పకుండ జోక్యం చేసుకొని పాపాన్ని శిక్షిస్తాడు. సృష్టి ప్రారంభం నుండి, నేటి వరకు కూడ చరిత్రలో జరుగుతున్నది ఇదే. ఆయన పాపాన్ని శిక్షిస్తూనే ఉన్నాడు. తనను విశ్వసించిన వారిని ఆదరిస్తూనే ఉన్నాడు. ఇక ఇప్పుడు అష్షూరు దేవుని ప్రజలను శిక్షించుటలో దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చింది. కాని ఇప్పుడు తన స్వంత పాపం కొరకు శిక్షించబడుతున్నది.

ఈ. **ఆయన దోషులను నిర్దోషులనుగా ఎంచడు (1:3) :** దేవుడు ప్రపంచ సృష్టికర్త మరియు దానిని నిర్వహించేవాడు మాత్రమే కాదు. దాని నైతిక పాలకుడు కూడ ఆయనే. కనుక ఆయన ఎంత దీర్ఘశాంతుడైనా నైతికపర పాపాన్ని శిక్షించక మానడు (నిర్గ.కా. 34:6,7; సంఖ్యా 14:17,18 చదవండి).

ఉ. **యెహోవా ఉత్తముడు (1:7) :** దేవుడు కోపగించి, ప్రతికారం తీర్చుకొంటే ఉత్తముడు ఎలా అవుతాడు? దేవుని పనిని, ఆయన ప్రజలను, నాశనంజేయ ప్రయత్నించిన వారిని పలుమార్లు దేవుడు తన మంచితనాన్ని బట్టి ఆపుతూ వచ్చాడు. అయితే తన సంకల్పాన్ని నెరవేర్చేందుకు, మరియు తన ప్రజలను సంరక్షించేందుకు దౌర్జన్యపరులను శిక్షించకుండ ఉండలేదు. ఆయన ఉత్తముడు గనుకనే న్యాయాన్ని బట్టి శిక్షిస్తాడు. ఆయన ఉత్తముడన్నది లేఖనాల ద్వారా జీవితం ద్వారా స్వయంగా నిరూపించబడిన సత్యం (కీర్త 25:8; 34:8).

ఊ. **ఆయన మన ఆశ్రయ దుర్గము (1:7) :** ఈ లోక రాజ్యాలు శత్రువు నుండి భద్రత కోసం దుర్గాలను నిర్మించుకుంటాయి. దేవుని పిల్లలకు దేవుడే ఆశ్రయ దుర్గముగా

ఉన్నాడు (కీర్త 94:22; 142; 5; 144:1), బాధ కలిగినపుడు (కీర్త 37:39), శ్రమ దినమందు (నహూ 1:7), ఆపత్కాలమందు (యిర్మీ 17:17), ఆశ్రయముగా ఉన్నాడు. ఆయనలో మనం సురక్షితంగా ఉంటాము (సామె 18:10).

పై లక్షణాలన్ని దేవునికి ఈ లోకముపైన గల అధికారాన్ని, తన ప్రజల పట్ల గల ప్రేమను, పాపం పట్లగల ద్వేషాన్ని ప్రత్యక్షం చేస్తున్నవి. "తనయందు నమ్మిక యుంచు వారిని ఆయన ఎరుగును" (1:7) అన్నది ఆయన ప్రజలకు భద్రతను గూర్చిన గొప్ప నిశ్చయతను ఇస్తున్నది. ఆయన న్యాయవంతుడన్న సత్యం, మనకు ఆయన ప్రజలుగా ఈ లోకంలో అన్యాయాన్ని, శ్రమలను సహించే శక్తినిస్తుంది.

2. **నీనెవెను నాశనం చేయుటకు, యూదాకు శుభవార్తనందించుటకు దేవుని తీర్మానం (1:9-15) :** ఈ భాగంలో శత్రువులకు తమ నాశనాన్ని గూర్చి భయాస్పదమైన మాటలు, మరియు దేవుని ప్రజలకు నిరీక్షణాస్పదమైన మాటలు మిళితమై ఉన్నాయి. ముఖ్యంగా దేవుని గూర్చి దురాలోచన చేసిన సన్హెరీబు యొక్క గర్వాన్ని గూర్చి ప్రస్తావించబడింది (1:9,11,14). క్రీ॥పూ॥ 701 సం॥లో అనగా హిజ్కియా కాలంలో యెరూషలేముపై దండెత్తిన ఈ రాజు, నీనెవె పట్టణమంతటికి అనగా దాని దుష్టత్వానికి సాదృశ్యంగా చెప్పబడ్డాడు. ఇక ఆ పేరు పెట్టుకొనేవారు కూడ ఉండరని ప్రవక్త చెప్పాడు. అంత దుర్మార్గతను అతడు జరిగించాడు (**II** రాజు 18,19; **II** ది.వృ. 32 అధ్యా; యెష 36,37 అధ్యాయాలు చదవండి).

దేవుని గూర్చి వ్యర్థమైన మాటలు పలికిన (**II** రాజు 18:20-22) సన్హెరీబు అతని వారసుని ద్వారానే చంపబడ్డాడు (**II** రాజు 19:35-37). అతని గర్వాన్ని దేవుడు అణచివేసాడు (**II** రాజు 18:21,22,28,29). ఇది జరిగి అనేక సంవత్సరాలైనా దురహంకారియైన ఈ రాజు నీనెవె పట్టణపు గర్వానికి సూచనగా చెప్పబడ్డాడు.

కొంతమంది పేర్లు తరతరాలకు సూచనగా ఉంటాయి. నోవహు యదార్థతకు, అబ్రహాము విశ్వాసానికి, యోబు సహనానికి నిదర్శనంగా ఉన్నారు. ప్రతి వ్యక్తి జీవిత ప్రభావం అనేక తరాలపై ఉంటుంది గనుక మన జీవితం ఇతరులను ఎలా ప్రభావితం చేస్తున్నదో పరీక్షించుకోవాలి. దుష్టత్వానికి సాదృశ్యంగా ఉన్నామా లేక మంచితనానికి సాదృశ్యంగా ఉన్నామా? ఇతరులు మన పేరును తరతరాలకు జ్ఞాపకం చేసుకొనేలా జీవిస్తున్నామా? లేక ఆ పేరే ఎత్తవద్దు అన్న నీచస్థితిలో ఉన్నామా?

నీనెవె పట్టణానికి మరో అవకాశం ఇవ్వబడదు (1:9) ఇదే ఆఖరు అవకాశం. ఇశ్రాయేలీయులపై ఉన్న, వారి కాడిమ్రానును విరుగగొట్టబడుతుంది. ఇంత కాలం వారిచే బాధించబడడానికి దేవుడు అనుమతించినా, ఇక మీదట తన ప్రజలను బాధించడు (1:12,13) ఇదే యూదావారికి ప్రకటించబడే సువార్త (1:15). అష్షూరు వారి పీడ విరుగడ అయింది అన్నదే వారికి శుభావార్త. యెషయా కూడ అష్షూరు నాశనమే

యూదులకు సువర్తమానమని చెప్పాడు (యెష 52:4-7). ఇవే మాటలను పౌలు రక్షణ సువార్తకు వర్తింపజేస్తూ రోమా పత్రికలో వివరించాడు (రోమా 10:15). ఇక్కడ పాపమనే కాడి విరుగగొట్టబడింది అన్న సువార్త ప్రకటించబడాలని పౌలు కోరుతున్నాడు. నహూము యూదా వారిని ఈ మాటలతో ప్రోత్సహిస్తూ అష్షూరు ఇకమీదట వారిపై ఎన్నడూ దాడిచెయ్యదని, అది బొత్తిగా నాశనమౌతుందని చెప్పాడు. (1:15) అక్షరాల అలాగే జరిగింది.

## II. రెండవ అధ్యాయం :

**1. దేవుని తీర్మానం అమలు పరచబడుట :** ఈ అధ్యాయంలో నీనెవె పొందిన ఘోర శిక్ష వర్ణించబడింది. ఈ శిక్ష విత్తిన దానిని కోయుట అనే నియమం ప్రకారమే జరిగింది. అష్షూరు చేసినట్లే దానికి చేయబడుతుంది. 500 సం॥లకు పైగా, నీనెవె వారు, (అష్షూరీయులు) పశ్చిమ ఆసియాలోని వారికి భయాన్ని పుట్టించారు. నీనెవె ఒకప్పుడు ఇతరులను కొల్లగొట్టింది. ఇప్పుడు ఇతరులు దానిని కొల్లగొడతారు (2:9).

ఈ అధ్యాయం ప్రారంభంలోని లయకర్త (2:1) బబులోను సైన్యం కావచ్చు లేదా, అష్షూరు చుట్టునున్న బబులోను, మాదీయ, సిథియనుల సైన్యాలైనా కావచ్చును. మరికొన్ని సంవత్సరాలలో జరుగబోయే దానిని నహూము చెప్తున్నాడు. దేవుని ప్రజలపై దేవుని తీర్పుఅయిపోయింది. వారిని సమకూర్చే సమయం వచ్చింది. గనుక ఇప్పుడు అష్షూరుకు తీర్పు జరుగనున్నది (2:2) దేవుడు ఉత్తర రాజ్యంలోని ఇశ్రాయేలును సమకూర్చినట్లే, దక్షిణ రాజ్యంలోని యూదావారిని (యాకోబును) కూడ సమకూరుస్తాడు. 2:3,4 లో నీనెవె పట్టణం మీదికి రానున్న శత్రువుల వర్ణన, 2:11,12 లో నాశనం కాకముందు నీనెవె పట్టణం యొక్క స్థితిని గూర్చిన వర్ణన కనిపిస్తుంది.

నీనెవె పట్టణపు ప్రాకారం 200 అడుగుల ఎత్తుగలది. దానిపై 1500 దుర్గాలున్నాయి. వాటిని ముట్టడించిన శత్రుసైన్యాలు, రక్తవర్ణపు దుస్తులతో భయాన్ని పుట్టించే రీతిగా మోహరించాయి. బహుశా వారు రాగి డాళ్ళు ఉపయోగించి ఉండవచ్చును. వాటిపై సూర్య రశ్మి పడినపుడు ఎరుపురంగుతో మెరుస్తూ ఉంటాయి. శత్రువులను భయపెట్టేందుకు ఉపయోగించే విధానమది. వారి రథాలు లోహంతో చేయబడడమే గాక వాటి చక్రాలలో పదునైన కొడవలి వంటిది బిగించబడి ఉంటుంది. వారు శత్రువులకు సమీపంగా వెళ్ళినప్పుడు వారిని, వారి గుఱ్ఱాలను, రథాలను నరుకుతూ వెళ్తుంది.

నీనెవె ప్రాకారం చాల విశాలమైనది, బలమైనది గనుక బబులోను రాజైన నెబోపోలస్సర్, 3 సంవత్సరాలు దానిని ముట్టడి వేయాల్సి వచ్చింది. 3 సార్లు బలంగా దాడి చేసాడు. కాని ప్రతిసారి విఫలుడయ్యాడు. ఈ సందర్భంగా నీనెవె పట్టణస్తులు బాగా త్రాగి సంతోషించసాగారు. అయితే అకస్మాత్తుగా ఆ ప్రకారం ప్రక్కనే ఉన్న టైగ్రస్ (హిద్దెకలు) నది ఒక్క సారిగా ఉప్పొంగింది. దాని అలలు బలంగా పట్టణ ప్రాకారాన్ని కొట్టసాగాయి. ఈ పట్టణ ప్రకారం 2 1/2 మైళ్ళ పొడవున, నది ఒడ్డున ఉన్నది. ఇది మామూలు

నీటి మట్టం కన్న పైకి కట్టబడినా, ఈ వరద ధాటికి, రథాలు సయితం సులభంగా లోపలికి ప్రవేశించేంత బీటలు ఏర్పడ్డాయి. దానిలో నుండే బబులోనీయులు పట్టణంలోనికి ప్రవేశించారు. అదే సమయంలో వ్యవసాయానికి సాగు నీటి కాలువల తలుపులన్నీ తెరవబడ్డాయి. నగరం పూర్తిగా మునిగిపోయింది (2:6,7). దేవుడే ఈ నాశనాన్ని నిర్ణయించాడు. దేవుడు కాపాడితేనే తప్ప, మానవులు తమ భద్రత కోసం కల్పించుకొన్నవన్నీ వ్యర్థమేనని ఈ భాగం జ్ఞాపకం చేస్తున్నది.

అష్షూరీయులు ప్రపంచంలోని దేశాల నుండి దోచుకున్న కొల్లసొమ్మునంతా బబులోనీయులు దోచుకున్నారు (2:9). శత్రుభయం వారి గుండెల్ని, మోకాళ్ళను వణికించాయి (2:10). ఒకప్పుడు మంచి ఆహారంతో పోషించబడిన వారి పెంపుడు సింహాలకు ఆహారకొరత ఏర్పడింది (2:12). వాటిలో అనేకము చంపబడ్డాయి.

సింహము, అష్షూరు మరియు బబులోను రాజ్యాల చిహ్నంగా ఉన్నది. వారి బలం కొట్టివేయబడింది అన్న ఉద్దేశంతోనైనా ఈ మాటలు చెప్పబడి ఉండవచ్చును, లేక వారి సైన్యంలో సింహాలు కూడ ఉన్నాయన్న అభిప్రాయం కూడ ఉన్నది. కొదమ సింహాలు వారి యౌవనస్థులను సూచిస్తున్నాయని కొందరి అభిప్రాయం (2:13). ఇంతగా నాశనం కావడానికి కారణం, దేవుడే వారికి విరోధి అయ్యాడు. "నేను నీకు విరోధినై యున్నాను" (2:13). ఈ మాట దేవుడు ఎక్కువ సార్లు చెప్పలేదు. మరో సందర్భంలో గోగు, మాగోగు (రష్యా)ను గూర్చి మాత్రం ఈ మాటను పలికాడు (యెహె 38:1; 39:1). దేవుడే విరోధి అయితే ఇక ఎవరు సహాయం చేస్తారు?

**III. మూడవ అధ్యాయం :** దేవుని ప్రతికార చర్యకు న్యాయం చేకూర్చబడింది.

**1. దేవుని తీర్పుకు కారణమైన నీనెవె పాపాలు (3:1-7) :** నీనెవె చేసిన పాపాలను తెలియజేయడం ద్వారా, దేవుడు దాన్ని నాశనం చేయడం న్యాయమేనని ప్రవక్త సూచిస్తున్నాడు.

బాహ్యంగా ఈ పట్టణం అనేకులతో యుద్ధాలు చేసి హింసాత్మక చర్యలకు పాల్పడడమే కాక (3:2,3) దాని లోపల కూడ నరహత్య, మోసము, బలత్కారము (3:1) ఉన్నది. దేవునికి అసహ్యమైన చిల్లంగితనము అనే పాపమున్నది (3:4) జ్యోతిష్యము, కాలజ్ఞానం, తాంత్రిక విద్య దేవునికి సంబంధించినవి కావు. అవి మానవ కల్పితాలు మాత్రమే. అవి దేవునికి, దేవుని వాక్యానికి విరుద్ధమైనవి. అష్షూరీయులు దేవునికి విరుద్ధంగా చేసిన కార్యాలను బట్టి దేవుడు వారికి విరోధి అయ్యాడు (3:5) తప్ప, దేవుడు ఏ దేశస్థులను కూడ ద్వేషించలేదు. ఆయన పక్షపాతి కాడు గనుక అందరినీ తన ప్రజలుగానే ప్రేమించాడు (యెష 19:23-25). నీనెవె పాపాన్ని బట్టి దేవుడు ప్రపంచ దేశాల మధ్య దానిని అవమానం పాలు చేసాడు (3:5-7) నీనెవె గొప్ప సంస్కృతి, నాగరికత, సంపదలు, దాని శక్తి అంతా నేలమట్టమైంది.

**2. నీనెవె నాశనము పోల్చబడుట (3:8-10) :** నీనెవె తనకు తాను కల్పించుకున్న భద్రతను బట్టి, తనను ఎవరూ ఏమి చేయలేరు అనుకొన్నది. అయితే దానికన్న ఎక్కువ

సైన్యం, ఆయుధ బలమున్న, నో అమోను పట్టణం కూడ ఎలా నాశనమైందో ప్రవక్త జ్ఞాపకం చేస్తున్నాడు (3:8–10). ఈ పట్టణం నైలు నది ఒడ్డున ఉన్నది. 18వ ఫరో మొదలుకొని, 20వ ఫరో వరకు, ఇది ఐగుప్తుకు రాజధానిగా ఉండినది. ఈ పట్టణానికి రెండు వైపుల ఎడారి, ఒకవైపు నైలు నది ఉన్నది. దానికి ఉత్తరాన, దక్షిణాన ఉన్న పట్టణస్తులందరూ దానికి సహాయకులుగా ఉన్నారు. అందువల్ల దానిని ఎవరూ జయింపలేరన్న ధైర్యం వారికుంది. దానిలోని శిల్పకళానిర్మాణాలు గ్రీకులు, రోమీయుల మెప్పు పొందాయి. ఐగుప్తీయుల దేవత పేరు ఈ పట్టణానికి పెట్టబడింది. అమోను ఆనే ఈ దేవతకు మానవ శరీరం, పొట్టేలు తల ఉంటుంది. నోఅమోనును, సార్గోను అనే అష్షూరీయుల రాజే నాశనం చేసాడు. నహూము ప్రవక్త మరోసారి గలతీ 6:7 లోని సూత్రాన్ని ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాడు. అష్షూరు నోఅమోనుకు చేసినట్టే దానికి చేయబడుతుంది.

ఏదేశమైనా తన ప్రభుత్వాన్ని బట్టి, తనకున్న భద్రతను బట్టి గర్విస్తున్నదంటే అది వారి మూర్ఖత్వమే అవుతుంది. లోకంలో మానవ ప్రభుత్వంలో దేవుని ప్రభుత్వం జోక్యం చేసుకున్నప్పుడు వారికున్న, వారు నమ్ముకున్న మూలాధారాలన్నీ కొట్టివేయబడతాయి. ఈ దినాన గొప్ప దేశాలన్నీ తమకున్న సాంకేతిక జ్ఞానాన్ని బట్టి అణ్వస్త్రాలను బట్టి అతిశయిస్తున్నాయి. వారందరూ నిరాయుధులుగా చేయబడే దినం వారి ఆయుధాలన్నీ నిర్వీర్యం చేయబడే దినం రాబోతున్నది. వ్యక్తిగతంగా అతిశయించే వారికి కూడ ఈ సూత్రమే వర్తిస్తుంది. వారి అతిశయాస్పదాలన్నీ కొట్టివేయబడతాయి. దేవుడే వారి జీవితానికి సార్వభౌముడని ఎరగనంత వరకు నాశనమే వారికి అంతము.

3. **నీనెవె నాశనాన్ని గూర్చిన వర్ణన (3:11–19) :** ఒక్క మాటలో చెప్పాలంటే నీనెవె ఇక స్వస్థత పొందనంతగా గాయపరచబడింది (3:19). దానిని పూర్తిగా శిక్షించుటలో దేవుడు పూర్తి బాధ్యతను వహించాడు. వారి భద్రత కోసం కట్టుకున్న కోటలన్నీ కూలిపోతాయి వ్యర్థమౌతాయి. (3:14) తమ శాయశక్తులా ప్రయత్నించినా శత్రుదళాలను ఆపలేరు (3:15). ప్రతి సంవత్సరం పెరిగే ఆదాయం ఇక ఉండదు పైగా వారి వర్తకులే ఉన్నదానినంతా దోచుకుంటారు (3:16). వారి సైన్యాధిపతులు పారిపోతారు (3:17) దాని కాపరులు, ప్రధానులు పతనమౌతారు (3:16). వారి సైన్యాధిపతులు పారిపోతారు (3:17) దాని కాపరులు, ప్రధానులు పతనమౌతారు (3:18). గనుక అన్ని స్థాయిలలో నాయకత్వపు కొరత కనిపిస్తుంది. వారు దేవుని నాయకత్వంలోనికి రానందువల్లనే ఇవన్నీ సంభవించాయి. రాజుల రాజు, సమాధానకర్త, లోకరక్షకుడునైన యేసు క్రీస్తును తృణీకరించిన దేశాల, వ్యక్తుల గతి ఇంతే.

దేవునికే తమ జీవితంపై సంపూర్ణ అధికారాన్ని ఇచ్చి (సామె 3:5,6) తమకున్న వాటన్నిటికి దేవుడే మూలాధారమని ఆయనను ఘనపరచిన వారిని దేవుడు ఘనపరుస్తాడు (ద్వితీ 8:17,18; **II** కొరి 3:5; **I** సమూ 2:30).

★ ★ ★ ★ ★

# గొప్ప సంభాషణ

## హబక్కూకు గ్రంథం సంగ్రహ సమీక్ష

**I. ఉపోద్ఘాతం :**

మానవుల మనస్సులలో తలఎత్తే ప్రశ్నలకు ప్రతీకగా ఉన్న హబక్కూకు గ్రంథం, విషమ పరిస్థితులలో మానవుల పరిస్థితి ఎలా ఉంటుందో అద్దం పట్టినట్లు చూపిస్తుంది. దేవుని గూర్చి మానవులకు కలిగే సందేహాలకు ఈ గ్రంథం జవాబిస్తుంది. బబులోను చెరకు ముందు, దక్షిణ రాజ్యంలో ప్రవచించిన చివరి ప్రవక్త హబక్కూకు.

**1. గ్రంథకర్త :** ఈ పుస్తకాన్ని హబక్కూకు వ్రాసినట్లు ఆరంభంలోనే చెప్పబడినా, అతని గురించి ఇతర వివరాలేవి తెలియవు. ఇతడు షూనేమీయురాలి కొడుకు అని (**II** రాజు 4:16), దానియేలు సహచరుడని పారంపర్య గాథలున్నాయి. గాని సరైన ఆధారాలు లేవు. అయితే ఇతడు గాయకులలో ఒకడని మాత్రం చెప్పవచ్చును (3:1). యోనా గ్రంథం లాగే ఇది ప్రవచనం కన్నా, ప్రవక్తకు దేవునితో ఉన్న అనుభవాన్ని ఎక్కువగా వివరిస్తున్నది.

**2. గ్రంథ రచన కాలం :** హబక్కూకు 1:6 లో ఒక చారిత్రాత్మక విషయాన్ని గూర్చి ప్రస్తావించబడిన దానిని కర్కెమీషు యుద్ధానికి ముందు హబక్కూకు ప్రవచించాడని చెప్పవచ్చును. సిరియా రాజ్యంలోని నగరముగా ఉన్న కర్కెమీషు అష్షూరీయుల పరమైపోయింది. వారి చేతిలో నుండి క్రీ॥పూ॥ 609 సం॥లో ఐగుప్తురాజైన ఫరోనెకో దానిని స్వాధీనం చేసుకున్నాడు (**II** ది.వృ. 35:20). అటుపిమ్మట **II**వ నెబుకద్నెజరు కాలంలో, అనగా క్రీ॥పూ॥ 605 సం॥ బబులోనీయుల వశం అయింది. (యిర్మీ 46:2). ఈ సంఘటన గూర్చి హబక్కూకు 1:6 లో చెప్పాడు గనుక క్రీ॥పూ॥ 605 సం॥కు ముందే ఈ ప్రవచనాలు చెప్పబడి, వ్రాయబడ్డాయని తలంచవచ్చును.

**3. ముఖ్యాంశం :** నహూము, హబక్కూకు మరియు జెఫన్యా ఒకే సందేశాన్ని ఇచ్చారు. మానవ ప్రభుత్వంలో, దేవుని ప్రభుత్వం ఎలా జోక్యం చేసుకుంటుందో, అలాగే వ్యక్తిగత జీవితాలలో ఎలా వ్యవహరిస్తాడో తెలిపారు. మానవ జాతిలో దేవుడు చేసే పనులను, వీరు విభిన్న రీతులుగా వివరించారు.

ఈ ముగ్గురూ దాదాపు ఒకే కాలానికి చెందినవారు. ముగ్గురూ యోషీయా మరియు యెహోయాకీము పరిపాలనకు మధ్య, అనగా యిర్మీయా ప్రవక్త కాలంలో ఉన్నారు. అప్పటికే ఉత్తర రాజ్యం చెరకు వెళ్ళింది. యోషీయా తరువాత దక్షిణ రాజ్యాన్ని పరిపాలించిన రాజులందరూ చెడ్డవారే. ఈ ముగ్గురు ప్రవక్తలు ఈ కాలమునకు చెందినవారు.

ఈ మూడు గ్రంథాలు ఒకేలాగ ఉన్నా, ఒకదానికొకటి వేరుగా ఉన్నాయి. హబక్కూకు గ్రంథంలోని సందేశం, నహూము సందేశానికి భిన్నమైనది. ప్రేమగల దేవుడు ఎలా శిక్షించగలడు? అన్నది నహూము ప్రశ్నయితే, దేవుడు లోకంలోని చెడును ఎందుకు శిక్షించడు? అన్నది హబక్కూకు ప్రశ్న. ఈ గ్రంథంలో, అతని ప్రశ్నలకు జవాబు లభించింది. ముగింపులో దేవుణ్ణి స్తుతించి, ఆరాధించిన చక్కని కీర్తన ఉన్నది. ఈ గ్రంథం నిట్టూర్పులతో ఆరంభించబడి నిరీక్షణతో, ఆనందంతో ముగించబడింది. ప్రశ్నలతో ఆరంభమై ఖచ్చితమైన జవాబుతో ముగించబడింది.

4. **మూలవచనం :** "నీతిమంతుడు విశ్వాసము మూలముగ బ్రదుకును". (హబ 2:2)

## B. గ్రంథ విభజన :

### I. ప్రవక్త వ్యాకులం - 1 అధ్యా

1. ప్రవక్త మొదటి సమస్య (1:1-4) (దేవుడు దుష్టత్వాన్ని ఎందుకు అనుమతిస్తాడు?)
2. దేవుని జవాబు (1:5-11) (యూదాను శిక్షించడానికి కల్దీయులను పంపించబోతున్నాడు)
3. ప్రవక్త రెండవ సమస్య (1:12-17) (యూదాను శిక్షించడానికి దుష్టజనాంగాన్ని ఎందుకు అనుమతించాడు, ఆ దుష్టులను ఎందుకు శిక్షించడు?

### II ప్రవక్త గ్రహింపు - 2 అధ్యా

1. ప్రవక్త అలవాటు (2:1) (రహస్య సమస్యను, రహస్య స్థలానికే తీసుకొని వెళ్ళాడు)
2. ప్రవక్త సహనం (2:2,3) (దర్శనం కోసం కనిపెట్టి ఉన్నాడు)
3. ప్రవక్తకు వెల్లడించబడిన విషయం. (2:4) (మానవ జాతిలోని భేదాలు - ఒక వర్గం నాశనం వైపు మరో వర్గం విశ్వాసంతో దేవుని వైపు వెళ్తున్నారు).
4. ప్రవక్త కోసం ఒక ఉపమానం (2:5-20). (దేవుడు దేశాల మధ్య పనిచేస్తూనే ఉన్నాడు - కల్దీయులు నాశనం చేయబడతారు).

### III. ప్రవక్త సంతోషం - 3 అధ్యా

1. ప్రవక్త ప్రార్థన (3:1,2) (చెడును శిక్షించేందుకు పూనుకున్న దేవుణ్ణి కరుణ చూపించమని ప్రార్థిస్తున్నాడు).
2. దేవుని ప్రణాళిక (3:3-17) (దేవుడు రాచఠీవితో రక్షణార్థమై రథాలమీద హుందాగా వస్తున్నాడు).
3. ప్రవక్త స్థితి (3:18,19) (వ్యాకుల స్థితి నుండి సంతోషకరమైన స్థితికి వచ్చాడు).

## C. అంశాల వారిగా సంగ్రహ వివరణ :

**I. ప్రవక్త సందేహాలు – వాటికి సమాధానాలు :** మొదటి అధ్యాయమంతా ప్రవక్తను వేధిస్తూ ఉన్న ప్రశ్నలతో మరియు దేవుడు ఇచ్చిన సమాధానాలతో నిండి ఉన్నది. ప్రవక్తకున్న అనేక సందేహాలను బట్టి కొందరు పండితులు ఇతన్ని పాత నిబంధన తోమాగా పరిగణిస్తారు. యూదులను అనగా దక్షిణ పాలస్తీన రాజ్యాన్ని పరిపాలించిన మంచి రాజు యోషీయా తరువాత దేశంలో యాథార్థత లోపించింది. ప్రజలు ధర్మశాస్త్రాన్ని పాటించక దేవుని నుండి తొలగిపోయారు. ఎక్కడ చూచినా నాశనం, బలత్కారం, కలహాలున్నాయి. ధర్మశాస్త్రం నిరర్థకమైపోయింది. న్యాయం చెడిపోయింది (1:3,4). ఇది తన స్వంత ప్రజల స్థితి. నిజ దేవుణ్ణి ఎరిగిన ప్రజల స్థితికి అన్యుల స్థితికి తేడా ఏమి లేదు. అన్యులైన కల్దీయులు తమవికాని ఉనికి పట్టులను ఆక్రమించాలన్న ఉద్రేకముతో సంచరిస్తున్నారు. వారు క్రూరులు, (1:6) బలత్కారులు (1:9). రాజులను, అధిపతులను హేళన చేసే అపహాసకులు (1:10). వారు ప్రభుత్వమును, విధులను తమ యిష్టానుసారంగా ఏర్పరచుకొంటారు (1:7) తమ బలాన్నే తమకు దేవతగా భావిస్తారు (1:11).

హబక్కూకు సమస్య ఏమంటే దేవుని ప్రజల దుష్టత్వాన్ని గూర్చి అతడు మొఱపెట్టినా జవాబు రాలేదు. దేవుడు వారు చేస్తున్న చెడును చూస్తూ కూడ ఊరకనే ఉన్నాడు. వారిని ఎందుకు శిక్షించడం లేదు? దేవునికి ఏమి బాధలేనట్టు, ఆ బాధ అంతా తనకే ఉన్నట్లు ప్రవక్త భావించాడు. పాతనిబంధనలోని మరికొంత మంది విశ్వాసులను కూడ ఈలాంటి ప్రశ్నలే వేధించాయి (కీర్త 13:1–4; 74:10,11; 89:46,47 ప్రస 8:11; విలా 5:20). ఈనాటి విశ్వాసులలో కూడ ఈలాంటి ప్రశ్నలే ఉన్నాయి. క్లిష్టపరిస్థితులెదురైనప్పుడు సాతాను, దేవుని మంచితనాన్ని గూర్చి మనలో సందేహాలు కలుగజేస్తాడు (ఆది 3:1; కీర్త 73:2–14; యోబు 24:1–12). దేవుడు ఏమీ పట్టించుకోనట్లు బాధపడతాము. కాని దేవుడు తన నిర్ణయకాలంలో ప్రతి ఒక్కటి చక్కగా చేస్తాడని గ్రహించము. ఆ విషయమే దేవుడు చెప్తున్నాడు. "మీ దినములలో నేనొక కార్యము జరిగింతును, ఆలాగు జరుగునని యొకడు మీకు తెలిపినను మీరతని నమ్మకయుందురు" (1:5). దేవుడు ప్రతి ఒక్కరి జీవితంలో జోక్యం చేసుకొని కార్యం చేస్తూనే ఉన్నాడన్న అవగాహన లేనప్పుడే ఈలాంటి సందేహాలు వస్తాయి.

యూదా చేస్తున్న పాపాలను బట్టి, దేవుడు కల్దీయులను వారిపైకి పంపించబోతున్నాడని తెలిపాడు (1:6) తన ప్రజలైనా, అన్యులైనా, పాపాన్ని శిక్షించకమానడు.

ఇప్పుడు ప్రవక్తకు మరో ప్రశ్న ఎదురైంది. దేవుడు తన ప్రజల దుష్టత్వాన్ని శిక్షించడానికి, వారి కంటె దుష్టులైనవారిని ఎందుకు వాడుకున్నాడు? వారిని ఆయన ఎందుకు శిక్షించడు? ఇది మొదటి ప్రశ్నకన్న మరింత క్లిష్టమైనది. అయితే ఈ సమస్యను హబక్కూకు సరైన వ్యక్తి దగ్గరికే తీసుకొని వెళ్ళాడు.

II. **ప్రవక్త గ్రహింపు :** హబక్కూకు దేవుని ఎదుట తన సమస్యనుంచి, ఆయన జవాబిచ్చేంత వరకు వేచి ఉన్నాడు. (2:1) సమస్యలెదురైనప్పుడు ప్రతి విశ్వాసి అనుసరించాల్సిన విధానమిదే. ఆయన వద్దనే మనకు జవాబు లభిస్తుంది. దేవుడు ఏ ఉద్దేశంతో వాటిని మన జీవితంలో అనుమతించాడో, వాటి వలన మనకు కలిగే మేలు ఏంటో ఆయన సన్నిధిలోనే తెలుసుకోగలుగుతాము (ఆది 25:22; కీర్త 73:16-28). మనం తలంచినట్లు దేవుడు చేయనపుడు బాధపడవద్దు (యెష 55:8,9).

దేవుడు దీర్ఘశాంతుడు గనుక దుష్టత్వాన్ని కొంతకాలం వరకు అనుమతిస్తాడు! దేవుని నిర్ణీత సమయంలో వారు తప్పకుండ శిక్షించబడతారు. కల్దీయులు నిర్దయగా అనేక దేశాలను నాశనం చేయడం (2:8) త్రాగుబోతు తనంతో నీచస్థితికి జారడం (2:5) వ్యర్థమైన దేవతలను ఆరాధించడం, ముఖ్యంగా తన ప్రజలను, దేవుడు సెలవిచ్చినదానికంటె ఎక్కువగా శిక్షించడం, దేవుడు చూస్తూనే ఉన్నాడు. దేవుడు ప్రతి ఒక్కరి, ప్రతి ఒక్క పాపాన్ని తప్పకుండా శిక్షిస్తాడు. దురాశపరులకు (2:5-11); రక్తపాతం జరిగించే వారికి (2:12-14) వంచన, దౌర్జన్యం చేసేవారికి (2:15-17) విగ్రహారాధకులకు (2:18-20) శిక్ష ఉన్నది. ఏ జాతియైనా, దేశమైనా అభివృద్ధిలోనికి వచ్చిందంటే అది దేవుని బట్టే జరిగింది (దాని 4:34,35). అలాంటి రాజ్యాలను తన శిక్షాదండముగా దేవుడు వాడుకొన్నాడంటే అది ఆయన ప్రణాళికను బట్టే జరిగింది గాని, వారు మంచివారని కాదు. అష్షూరు, బబులోను రాజ్యాలను దేవుడు తన ప్రజల పాపాలను సరి చేయడానికి శిక్షాదండముగా వాడుకోవడం క్రొత్తేమికాదు (యెష 10:5). అయితే వారు మితిమీరినపుడు ఊరుకోడు. వారిని కూడ తప్పక శిక్షిస్తాడు.

హబక్కూకు దేవుని వద్ద నుండి గ్రహించిన విషయాల్లో ఇది ఒకటి. తాను గ్రహించిన విషయాలను, పరుగెత్తుతూ కూడ చదువగలిగేలా స్పష్టంగా వ్రాయమని దేవుడు చెప్పాడు (2:2) దేవునికి ఒక నిర్ణయకాలం ఉన్నది. అంత వరకు కనిపెట్టాల్సిన అవసరత ఉన్నది (కీర్త 42:11; 46:10; విలా 3:26). అలా కనిపెట్టిన హబక్కూకు దేవుని సన్నిధిలో మూడు విషయాలను గ్రహించగలిగాడు.

1. **ఇశ్రాయేలీయుల విషయం దేవుని నైతిక తీర్పు (2:5-13)**
2. **నీతిమంతుడు విశ్వాసము మూలముగ బ్రదుకును (2:4).**

ఇది ప్రతి విశ్వాసికి నిరీక్షణతో కూడిన మాట. లోకంలో రెండు రకాల మనుష్యులు ఉన్నారు. లోకస్తులు వారికున్న వాటిని బట్టి బ్రతకగలం అనుకొంటారు. వారిలో యథార్థత ఉండదు. వారికున్న వాటిని బట్టి తమలో తాము అతిశయపడతారు. కాని నీతి మంతులైతే విశ్వాసం ద్వారా బ్రదుకుతారు.

ఈ చక్కని వేదాంతపరమైన వాక్యం బైబిలులో మూడు సార్లు పేర్కొనబడినది. రోమా 1:17లో యూదులను మరియు అన్యులనుద్దేశించి, గలతీ 3:11-14 లో అన్యులను

గూర్చి మరియు హెబ్రీ 10:38 లో యూదులను గూర్చి వ్రాయబడింది. ధర్మశాస్త్రం యూదులను గ్రుడ్డి వారిని చేసింది. (**II** కొరి 3:12-15) కాని కృప అన్నది వారు విశ్వాసం ద్వారా రక్షించబడేందుకు మార్గాన్ని చూపించింది (రోమా 3:10; 4:1-5). అలా అని విశ్వాసం, దేవుని చట్టాన్ని ప్రక్కకు పెట్టలేదు (రోమా 3:31). అలాగే దేవుడు కూడా తన ఇతర నిబంధనలను ప్రక్కకు పెట్టలేదు (ద్వితీ 30:3; **II** సమూ 7:16). ఇశ్రాయేలు జాతిలో నుండి, దేవుని యందు విశ్వాసముంచిన శేషమును దేవుడు తప్పకుండా రక్షిస్తాడు (రోమా 11:1-5). రోమా 1:17లోని ఈ మాట విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుటను గూర్చి చెప్తుంది. గలతీ 3:11లో జీవితాన్ని కొనసాగించడానికి అవసరమైన విశ్వాసాన్ని గూర్చి చెప్తుంది. హెబ్రీ 10:38 లో నిత్యత్వము కొరకైన విశ్వాసాన్ని గూర్చి చెప్తుంది.

**3. దేవుని భవిష్యత్ ప్రణాళికను గూర్చిన గ్రహింపు.**

ఎ) బబులోను ఇతరులకు చేసినట్టే దానికి చేయబడుతుంది (2:15-20).

బి) ప్రభువు మహిమతో తిరిగి వస్తాడు (2:14) : అప్పుడు సముద్రము జలములతో నిండియున్నట్టు భూమి యెహోవా గూర్చిన జ్ఞానముతో నిండి యుంటుంది (యెష 11:9-12). అలాగే "యెహోవా తన పరిశుద్ధాలయములో ఉన్నాడు. ఆయన సన్నిధిని లోకమంతయు మౌనముగా ఉండునుగాక!" అన్న మాటలు కూడ వెయ్యేండ్ల పాలనలో జరుగబోయేవని గ్రహించాలి (2:20).

## III. ప్రవక్త ఆనందం : (3వ అధ్యాయం)

అనేక సందేహాలు, సమస్యలు మరియు వ్యాకులత నిండిన మనస్సుతో ఘోషించిన హబక్కూకు, దేవుని సన్నిధిలో కనిపెట్టి, గ్రహించిన విషయాలను బట్టి అతని వైఖరిలో, ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. దేవుడు ఏమి చేస్తున్నాడో గ్రహించగలిగాడు.

**1. ప్రవక్త మనస్సు ఉజ్జీవించబడింది (3:1,2) :** కారణం అతడు దేవుని కార్యాలను అర్థం చేసుకోగలిగాడు. దేవుని కృపను, మహిమను మరింత లోతుగా గ్రహించి, అనుభవించగలిగాడు. ఇంతవరకు పాపం చేసిన వారిని శిక్షించమని అడిగినవాడు, ఇప్పుడు వారిపట్ల వాత్సల్యతను చూపించమని గోజాడుతున్నాడు. దేవుడు వారిని కఠినంగా శిక్షిస్తాడేమోనని భయపడుతున్నాడు. దేవుడు తన వాత్సల్యతను జ్ఞాపకం చేసుకొంటె మనము నిర్మూలం కాము (విలా 3:22,33). ఆయనకు అనుదినము నూతనముగా వాత్సల్యత పుడుతున్నది గనుక మనం ఇంకా సజీవంగా ఉన్నాం. అంతేగాని దేవుడు మన పాపాల్ని జ్ఞాపకం చేసుకొని వెంటనే శిక్షిస్తే ఎప్పుడో నశించిపోయేవారము. అలా అని దేవుని దీర్ఘశాంతాన్ని తృణీకరిస్తే (రోమా 2:4); ఆయన, పాపానికి శీఘ్రంగా శిక్ష విధించడని (ప్రస 8:11) పాపంలోనే కొనసాగుతూ వుంటే మాత్రం హఠాత్తుగా నాశనమౌతారు.

2. **ప్రవక్తకు పునః నిశ్చయత కలిగింది (3:3-16) :** కారణం, దేవుని మహిమ ప్రభావాలను మరియు ఆయన గతంలో చేసిన కార్యాలను కళ్ళకు కట్టినట్లుగా చూడగలిగాడు. ఈ భాగములో ప్రవక్త అత్యున్నత స్థాయిలో పాడిన స్తుతి గీతం కనిపిస్తున్నది. ఈ కీర్తనలో మనుష్యులు చేసిన వాటిని గూర్చి గాక, దేవుడు మనుష్యుల ద్వారా చేసిన కార్యాలు వివరించబడ్డాయి. కనుక మనుష్యుల పేర్లు వ్రాయబడలేదు. కొంతమంది పండితులు ఈ వర్ణనలో ఇద్దరు వ్యక్తులు, అనగా మోషే (3:3-10).

యెహోషువ (3:11-15) ఉన్నట్లు చెప్తారు. మరికొందరు అబ్రహాము కూడ అదృశ్యంగా కనిపిస్తున్నాడని (3:3-6) చెప్తారు. అయితే ఎంతమందిని వాడుకున్నాడనే దానికన్న ఆయన ఎన్ని కార్యాలు చేసాడన్నది ముఖ్యం. ఎవరిని వాడుకున్నాడనే దానికన్న ఆయన వారి ద్వారా ఏమి చేసాడన్నది ముఖ్యం కనుక వ్యక్తులపై కాక దేవుని పైననే దృష్టి నిలపాలి. ఆయన ప్రతి విశ్వాసి ద్వారా ఈ లోకంలో తన ప్రణాళికను నెరవేర్చాలని కోరుతున్నాడు. అందులో మనమందరము కూడ ఉన్నాము.

ఈ భాగంలో చెప్పబడిన తేమాను ఎదోములో ఉన్నది. పారాను సీనాయికి సమీపంగా ఉన్నది (3:3) ఇది అబ్రహాము ఐగుప్తుకు వెళ్ళిన సందర్భం కావచ్చు అని కొందరు (ఆది 12:10), ఇశ్రాయేలీయులు ఐగుప్తుకు వచ్చిన సందర్భం అని మరి కొందరు చెప్తారు (ఆది 46:6). 3:5లోని తెగుళ్ళు కూడ అబ్రహాము కాలంలో వచ్చిన కరవు అని, లేక ఐగుప్తీయులపైకి పంపించబడిన తెగుళ్ళు అన్న రెండు అభిప్రాయాలున్నాయి. కూషు, ఇతియోపియాలో ఉన్నది. మిద్యానులో మోషే 40 సంవత్సరాలు ఉన్నాడు (3:7). ఈ వచనంలోని వర్ణన, మోషేఫరో కుమార్తెకు కుమారునిగా ఉన్నప్పుడు సైన్యంతో ఇతియోపియా పైకి వెళ్ళిన సందర్భం కావచ్చునని చెబుతారు. అతడు ఇతియోపియాకు వెళ్ళినట్లు ఆధారాలున్నాయని వారు చెబుతారు. అది నిజమైనా, కాకున్నా మోషే సకల విద్యలలో ప్రవీణుడు అన్నది సత్యం (అపొ 7:22) నదులు మరియు సముద్రాల వర్ణన (3:8-10). ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రాన్ని మరియు యొర్దాను నదిని దాటిన సందర్భాన్ని మరియు పర్వతాలు కంపించడం, మోషే సీనాయి పర్వతంపై పది ఆజ్ఞలను పొందిన సందర్భాన్ని జ్ఞాపకం చేస్తున్నాయి (నిర్గ 14:15-31; యెహో 3:7-17).

దేవునికి నదులు మరియు సముద్రం మీద కోపమేమి లేదు గాని, అవి చీల్చబడినపుడు కలిగిన భీభత్సం హీబ్రూ కావ్య రూపంలో వర్ణించబడింది. ఆయన తన ప్రజల దారికి అడ్డుగా ఉన్న ఆ జలాలను అదుపుచేయ శక్తిగల దేవుడు. ఇక 3:11, దేవుడు యెహోషువ ద్వారా జరిగించిన కార్యాన్ని సూచిస్తున్నది. (యెహో 10:12-14). ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించాక దేవుడు అక్కడ ఉన్న అన్యజాతులన్నిటిని అణగద్రొక్కాడు (3:12). 13వ వచనంలోని అభిషిక్తుడు అన్న మాట ఇశ్రాయేలు జాతి అంతటికి గాని, రాబోవు మెస్సీయాకు గాని సూచనగా ఉన్నది.

3. **ప్రవక్త ప్రతిస్పందన (3:16) :** ప్రవక్త దేవుని గత కార్యాలను జ్ఞాపకం చేసుకున్నప్పుడు, తన మనస్సులోని ప్రశ్నల విషయం అనగా, ఇశ్రాయేలీయుల పాపానికి, బబులోనీయుల పాపానికి దేవుని శిక్ష ఉంటుందన్న జావాబును పొందాడు. అయితే వారికి దేవుడు చేయబోయే ప్రతికారం అతన్ని మానవరీత్యా కలవర పెట్టింది. అతని అంతరంగంలోని కలవరం భౌతిక శరీరంపై ప్రభావాన్ని చూపించింది (3:16). అయినా తాను చేయగలిగిందేమి లేదుగనుక ఊరకొని, ఆ శ్రమ దినము కొరకు కనిపెట్టాల్సిందే నంటున్నాడు. దేవుడు వారిని శిక్షించే సమయంలో కలిగే దుస్థితిని గూర్చి 17వ వచనంలో చెప్తున్నాడు.

4. **ప్రవక్త హృదయానందం (3:18) :** హబక్కూకు **"నీతిమంతుడు విశ్వాసము మూలముగా జీవించును"** అని తెలుసుకున్నాడు గనుక రాబోవు దుస్థితి కాలంలోను తాను యెహోవాయందు ఆనందిస్తానని చెప్పగలిగాడు. ఆ కాలమును గూర్చి ఆలోచించినపుడు భౌతికంగా అతడు బలహీనుడైపోయినా, ఆధ్యాత్మికంగా స్థిరమైన నిశ్చయతను కలిగి ఉన్నాడు. ప్రతి విశ్వాసి తన జీవితంలో నేర్చుకోవలసిన గొప్ప పాఠం ఇది. ఈ దినాల్లో అనేకులు సమృద్ధిని గూర్చిన సువార్తను విని యేసు క్రీస్తును విశ్వసించినవారికి ఇక ఏ లోటురాదు. కష్టాలు అసలే ఉండవని అపోహపడుతున్నారు. కాని "యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే కాక, ఆయన పక్షముగా శ్రమపడుటయు ఆయన పక్షమున మీకు అనుగ్రహించబడెను" అని వాక్యం సెలవిస్తున్నది (ఫిలి 1:30). దేవుడు మనం అడిగినవన్నీ ఇస్తాడని చెప్పేది సరైన సువార్త కాదు. మన సమస్యలను తీర్చడానికి దేవుడు ఉపయోగించే విధానాలు వేరుగా ఉంటాయి. మన సమస్యలన్నిటికి దేవుడొక్కడే జవాబు అని హబక్కూకు సంక్షిప్త పర్చాడు. తన చుట్టు ఎన్నో సమస్యలున్నా, తనకు ఏమున్నా లేకున్నా దేవుని యందే తనకు ఆనందము ఉన్నదన్న రహస్యాన్ని కనుగొన్నాడు. మనం కూడ అలాగే ఉండాలని దేవుడు కోరుతున్నాడు. మనం ఎవరమైనా సరే, మన సమస్య ఏదైనా సరే, దేవునికి మన పట్ల ఓ ఉద్దేశం ఉన్నది. మనం మంటి వారము (I కొరి. 15:47-49) కాని దేవుడు మన విషయం పరలోక ప్రణాళిక కలిగి ఉన్నాడు (I కొరి. 3:18). మనం ఆయన రూపంలోనికి మార్చబడడానికి ఆయన **"శిక్ష"** అనే ఉలిని, **"వాక్యమనే"** సుత్తెను ఉపయోగిస్తాడు. మన పట్ల దేవునికి గల ఉద్దేశాలను మనం నమ్మితే ఆయన తన కార్యాన్ని చేస్తాడు. ఆయన ద్వారా మరియు ఆయనలోనే మన ఆశల్ని తీర్చుకోగలము. **"నేను మేల్కొనునపుడు నీ స్వరూప దర్శనముతో నా ఆశను తీర్చుకొందును"** (కీర్త 17:15). అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!

**TTB - Telugu - Study Outlines - Book of Jonah, Micah, Nahum & Habakkuk**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**